RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




05 నవంబర్ 2024 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:132

# రేవంత్ రెడ్డికి

## బీసీ సంఘాల కృతజ్ఞతలు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు అమలయ్యేందుకు వీలుగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలియజేశాయి.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య , ఎమ్మెల్యే దానం నాగేందర్ , ఫిషర్ మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణమోహన్ రావు బీసీ సంఘాలకు చెందిన ఇతర నేతలు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆర్.కృష్ణయ్య , బీసీ సంఘం నేతలు సీఎం తో అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని, ఆ ప్రక్రియలోనే డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

# సిడ్నీలో స్పీకర్ బృందం




67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ( సీపీఎ ) కాన్ఫరెన్స్ జరిగే ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ , సిడ్నీ కు చేరుకునిరిజిస్ట్రేషన్ చేసుకున్న తెలంగాణ లేజిస్లేచర్ బృందం.తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్‌గుత్తా సుఖేందర్ రెడ్డి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ మరియు లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు ఈరోజు రిజిస్ట్రేషన్ ప్రాసెస్ పూర్తి చేశారు.కాన్ఫరెన్స్ కు సంబంధించిన మెటిరియల్ ను, సమాచారాన్ని సీపీఎ ప్రతినిధులు తెలంగాణ బృందానికి అందజేశారు.ఈసందర్భంగా శాసనసభ, శాసనమండలి పనితీరు, నిర్వాహణలపై తెలంగాణ బృందం సీపీఎ ప్రతినిధుల మద్య చర్చ జరిగింది. నవంబర్ 5,6,7 తేదీలలో 67వ సీపీఎ కాన్ఫరెన్స్ ప్రధాన వేదిక అయిన ఐసీసీ సిడ్నీలో జరుగుతుంది.

# కీసర రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 4: కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ మాత్యులు కొండా సురేఖా కీసర గుట్టలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కీసరలో సామూహిక దీపొత్సవ కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. మంత్రి ధ్వజస్తంభం పై ఆకాశ దీపాన్ని వెలిగించి, అనంతరం దీపాలను నీటిలో వదిలారు.



ఈ కార్యక్రమాలను మాధవానంద సరస్వతి స్వామి దగ్గరుండి మంత్రితో పూజ కార్యక్రమాలను నిర్వహింపజేసారు. మంత్రితో పాటు దేవాదాయ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ , దేవాదాయ శాఖ కమీషనర్ ఈ పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్రెడ్డి, కీసర ఆర్డిఓ సైదులు, తహాసీల్దారు, ఆలయ ఛైర్మన్ నాగలింగం, ఆలయఈఓ సుధాకర్ రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంపుపై దృష్టి సారించండి

### జాయింట్ వెంచర్స్ లో వివాదాలు పరిష్కరించి ఆదాయం పెంచండి

### రిసోర్స్ మొబైల్ జేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంచే మార్గాల పై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తో పాటు మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబులు పాల్గొన్నారు. జాయింట్ వెంచర్స్ లో విలువైన ఆస్తులు ఉన్నాయి... ప్రైవేట్ వ్యక్తులు కోర్టుకు వెళ్లి వివాదాలు సృష్టిస్తున్నారు. ఈ అంశంపై నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, లా సెక్రటరీలతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ సమావేశమై వారంలోగా సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. కాలుష్యం సమస్య ఉన్న పరిశ్రమల నిర్వాహకులు తాము నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని సబ్ కమిటీకి విజ్ఞప్తులు చేశారు. పరిశ్రమల యజమానుల విజ్ఞప్తులు పరిశీలించి వారు ఓ ఆర్ ఆర్ బయట పరిశ్రమలు స్థాపించి ముందుకు వెళ్లేలా సహకరించండి, పరిశ్రమలను ప్రోత్సహించాలని హైదరాబాద్ నగరం లో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను సబ్ కమిటీ సభ్యులు ఆదేశించారు. మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెగ్యులర్ గా జరుగుతున్న ప్లాట్ల బహిరంగ వేలం ప్రక్రియ పై సబ్ కమిటీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. ముందుగా కొంత బాగాన్ని వేలం వేసి ప్రభుత్వ ఖజానాకు గరిష్ట ఆదాయం సమకూరేలా ముందుకు వెళ్లాలని గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న ప్లాట్ల స్థితిగతులను సబ్ కమిటీ సమీక్షించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 5 ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు పెద్ద మొత్తంలో ఉద్యోగ అవకాశాలతో పాటు ఆర్థిక చేయూత లభిస్తుందని అధికారులకు వివరించారు. సబ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు మినిట్స్ రూపంలో నమోదు చేయాలని, మరో వారంలో జరిగే సమావేశానికి అధికారులు యాక్షన్ టేకెన్ రిపోర్టుతో సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హౌసింగ్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

# ప్రభుత్వం ప్రజా వైద్య ఆరోగ్యం పై నూతన పాలసీని అమలు చేస్తున్నాం

### -వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



ప్రజాబలం కొల్చారం మండలం నవంబర్ (04) నర్సాపూర్ లో త్వరలో ఐసీయూ, ఎన్ డి సి, అత్యవసర వైద్యశాఖ, ట్రామా కేంద్రాల ఏర్పాటు ఐదు బెడ్లతో డయాలసిస్ కేంద్రం ఈరోజు నుంచి సేవలందిస్తుంది

నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి

5 పడకల సామర్థ్యంతో రూ. 50.00 లక్షల రూపాయల వ్యయంతో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొనీ, ప్రారంభించారు.

నూతన డయాలసిస్ సెంటర్ 22 మంది డయాలసిస్ రోగులకు నేటి నుంచి లబ్ధి చేకూరనుంది

ఏరియా హాస్పిటల్, నర్సాపూర్ – 5 పడకల కెపాసిటీతో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి పరిధిలో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మరియు 1 కమ్యూనిటీ హెల్త్ సెంటర్, నర్సాపూర్ పట్టణం మధ్యలో ఉంది, ఇందులో కౌడిపల్లి మొత్తం కలిపి సుమారు 2 లక్షల మంది జనాభా ఉన్నారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ మెదక్ జిల్లా మెదక్ జిల్లా ఆసుపత్రిలో సుమారు 100 మందికి పైగా డయాలసిస్ రోగులు చికిత్స పొందుతున్నారని. 100 మందిలో, 22 మంది డయాలసిస్ రోగులు నర్సాపూర్ నియోజకవర్గానికి




చెందిన వారిగా వివరించారు.

నర్సాపూర్ నియోజకవర్గం నుండి మొత్తం రోగులు: 22 మంది రోగులు

నర్సాపూర్-7, కౌడిపల్లి-5, కుల్చారం మండలం - 10 రోగులు ఉన్నట్లు పేర్కొన్నారు వారానికి 3 సార్లు : 14 మంది రోగులకు చికిత్స అందిస్తున్నట్లుగా వివరించారు.

ఈ 22 మంది డయాలసిస్ రోగులే కాకుండా సంగారెడ్డి, సంగారెడ్డి జిల్లా, నిమ్స్, హైదరాబాద్, మల్లారెడ్డి ఆసుపత్రుల్లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరికొందరు రోగులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. నర్సాపూర్ ప్రాంతానికి త్వరలో ఐసీయూ ఎన్డీసీ ట్రామా అత్యవసర శాఖ లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వం వైద్య ఆరోగ్యం పై నూతన పాలసీని అమలు చేస్తామన్నారు.

మహమ్మద్ నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ,

అనంతరం కౌడిపల్లి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు స్థిరమైన లక్ష్యం ఉండాలని విద్యార్థులకు సూచించారు.

# ప్రజాబలం

05 నవంబర్ 2024 మంగళవారం


# మహారాష్ట్ర ఎవరి పక్షం?

ఈసారి మహారాష్ట్రలో, జార్ఖండ్‌లో సంక్షేమ మంత్రం పనిచేస్తుందా? బీజేపీ పట్టు బిగిస్తుందా? కాంగ్రెస్ పుంజుకుంటుందా? శాసన సభ్యుల సంఖ్య ఆధారంగా న్యాయపరంగా శివసేన (ఏక్ నాథ్ షిండే) ఎన్సీపీ (అజిత్ పవార్)లకు గుర్తింపు లభించినా ప్రజాకోర్టులో తీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుంది? వంటి అనేక ప్రశ్నలకు నవంబర్ 20న ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారు. హర్యానాలో కిసాన్, జవాన్, పహిల్వాన్ ఆందోళనలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు తోడుగా పదేళ్ల బీజేపీ పాలనపై వ్యతిరేకత కార ణంగా అధికారం మార్పు ఖాయమని అందరూ భావించారు. అలాంటి క్లిష్ట సమయంలో బీజేపీ తన అభ్యర్థులను ముందుగానే ప్రకటించి సంఘటితంగా ప్రచారంలో దూసుకుపోయింది. రాష్ట్రంలో ప్రజాభిప్రాయాన్ని మలచడంలో ఆర్ఎస్ఎస్ బృం దాలు నిర్విరామంగా కృషి చేశాయి. నేరుగా బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయమని కాకుండా దేశ ప్రయోజనాలు, హిందుత్వం, సుపరిపాలన, అభివృద్ధి, ప్రజాసంక్షేమం, అగ్నిపథ్ నియామకాలు, రైతు సమస్యలు వంటి అంశాల గురించి ప్రజలకు విడమరచి చెప్పి ప్రజాభిప్రాయాన్ని బీజేపీకి అనుకూలంగా మలచడానికి ఈ బృందాలు చేసిన కృషి సఫలం కావడం వల్ల అననుకూల వాతావరణంలో కూడా బీజేపీ విజయం సాధించింది. కాగా, హర్యానా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు, బలమైన దళిత నేత కుమారి సెల్జా ప్రచారానికి దూరంగా ఉండటం, ఆప్ పార్టీతో పొత్తు కుదుర్చుకోకపోవడం వంటి చర్యల వలన అనుకూల వాతావరణంలో కూడా కాంగ్రెస్ పరాజయం చెందింది. పార్లమెంట్ ఎన్నికల్లో అనుకున్న స్థాయిలో విజయం సాధించకపోవడం, అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడంతో ఖంగు తిన్న బీజేపీకి హర్యానా ఎన్నికల విజయం కొంత సంతృప్తిని మిగిల్చింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన ఓటమి ప్రభావంతో విపక్ష ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీకి బేరమాడే శక్తి తగ్గింది. 81 స్థానాలున్న జార?ండ్ అసెంబ్లీలో 70 స్థానాల్లో ఇండియా కూటమి పక్షాలైన జార?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తున్నా, సింహ భాగం జేఎంఎంకే దక్కనుందని సమాచారం. ఇక అసెంబ్లీ సీట్ల పరంగా ఉత్తరప్రదేశ్ తరువాత రెండవ అతిపెద్ద రాష్ట్రమైన మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఎన్‌డీఏ, ఇండియా కూటములకు అత్యంత కీలకం. ఉద్ధవ్ ఠాక్రే శివసేన (యుబిటి) ఎన్సీపీ (శరద్ పవార్) కాంగ్రెస్‌తో కూడిన మహావికాస్ అఘాడి (ఎంవీఏ), బీజేపీ, శివసేన (ఏక్ నాథ్ షిండే) ఎన్సీపీ (అజిత్ పవార్)ల కూటమి మహాయుతి అలయన్స్ మధ్య తీవ్రమైన ద్విముఖ పోటీ నెలకొంది. సిద్ధాంతపరంగా వ్యతిరేకమైన కాంగ్రెస్ పార్టీతో పొత్తు వ్యతిరేకించి 2022లో శివసేన పార్టీని చీల్చి ఉద్ధవ్ ఠాక్రేను ముఖ్యమంత్రి పదవి నుంచి దించి బీజేపీతో కలిసి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తరువాత 2023లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని (ఎన్సీపీ) చీల్చి శరద్ పవార్ అన్న కుమారుడు అజిత్ పవార్ మహాయుతి కూటమిలో చేరి ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహాయుతి 17 స్థానాల్లో, ఎంవీఏ 30 స్థానాల్లో విజయం సాధించారు. అయితే శాసనసభ ఎన్నికల్లో అంతక న్నా మంచి ఫలితాలు సాధిస్తామని ఎంవీఏ ఆత్మ విశ్వాసంతో ఉంది. 2019 శాసనసభ ఎన్నికల్లో 147 స్థానాల్లో పోటీ చేసినా హర్యానా ఎన్నికల నుండి గుణపాఠం నేర్చుకున్న కాంగ్రెస్ మహారాష్ట్రలో 85 సీట్లతో సరిపుచ్చుకుని మిత్రపక్షాలతో సయోధ్య నిలుపుకుంది. మహాయుతి కూటమిలో ప్రధాన పార్టీ అయిన బీజేపీ ఇప్పటికే 121 మంది అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతోంది. ఆ పార్టీ హర్యానాలో అనుసరించిన ఫార్ములా ప్రకారం చిన్న చిన్న ప్రజా సమూహాలతో ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాల సభ్యులు సమావేశం అవుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 1.25 లక్షల బృందాలతో ఇటువంటి భేటీలు జరిగాయని అంటున్నారు. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ పార్టీల చీలిక అనంతరం జరిగిన 2024 పార్లమెంట్ ఎన్నికల ఫలితాల సరళిని పరిశీలిస్తే ఇండియా కూటమికి 43.71 శాతం, ఎన్డీఏ కూటమికి 43.55 శాతం ఓట్లు వచ్చినా కానీ 178 శాసనసభ స్థానాల్లో కీలకమైన పశ్చిమ మహారాష్ట్ర, విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో మహాయుతి కూటమి కన్నా ఎంవీఏ కూటమి సుమారు 9.73 శాతం ఆధిక్యతలో ఉండటం గమనార్హం. మరాఠ్వాడా ప్రాంతంలో నయితే మహాయుతి కూటమి కేవలం 29 శాతం ఓట్లు తెచ్చుకుని ఎంవీఏ కన్నా 15.7 శాతం వెనుకబడింది. ఈనేపథ్యంలోనే రాజకీయ లబ్ధికోసం మరాఠీ క్రీమీలేయర్ సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించి, తిరస్కరించిన మరాఠా రిజర్వేషన్ అంశాన్ని తిరిగి తెరమీదకు తెచ్చారు. ఇండియా కూటమి పశ్చిమ మహారాష్ట్ర (47.8%), విదర్భ (46%), మరాఠ్వాడా (44.7%) ప్రాంతాల్లో ఆధిక్యత సాధించగా, ఎన్‌డీఏ కూటమి థానే, కొంకణ్ (47.8%), ముంబై (49.3%) ప్రాంతాల్లో ఆధిక్యత సాధించింది. ఉత్తర మహారాష్ట్ర ప్రాంతం లో ఇరు కూటములు దాదాపు సరి సమానంగా ఉన్నాయి. తొమ్మిది ఎస్సీ, ఎస్టీ లోక్‌సభ స్థానాల్లో కేవలం ఒక్క స్థానం మాత్రమే మహాయుతి కూటమి దక్కించుకోగలిగింది. శివసేన, ఎన్సీపీ చీలిక వర్గాలలో శివసేన (యుబిటి) 16.52 శాతం, ఎన్సీపీ (శరద్ పవార్) 19.27 శాతం ఓట్లతో ముందంజలో ఉండగా శివసేన (ఏక్ నాథ్ షిండే) 12.95 శాతం, ఎన్సీపీ (అజిత్ పవార్) 3.60 శాతం ఓట్లతో వెనకబడ్డాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత అప్రమత్తమైన ముఖ్యమంత్రి షిండే సుమారు లక్ష కోట్లు ఖర్చయ్యే 'లడ్కీ బహెన్' వంటి పలు ప్రజాకర్షక పథకాలను ప్రారంభించారు. రూ.20,151 కోట్ల రెవెన్యూ లోటు, రూ.1,10,355 కోట్ల ఆర్థిక లోటు, దాదాపు రూ.7 లక్షల కోట్లకు మించిన అప్పుల భారంతో సతమతమవుతున్న రాష్ట్రానికి ఈ పథకాలు తలకు మించిన భారంగా పరిణమించాయి. కొత్త పథకాల కోసం నిధుల మళ్లింపు వలన ఇప్పటికే అమలులో ఉన్న, ఉదాహరణకు ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు లక్ష రూపాయలు ఇచ్చే పథకం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ఆపేశారు. వివిధ ప్రాజెక్ట్ పనులు చేసిన గుత్తేదారులకు దాదాపు రూ.500 కోట్లు బకాయిలు ఉండటం వలన అభివృద్ధి పనులు నెమ్మదించాయి. కావున కేవలం అభివృద్ధి నినాదంతోనో లేదా సంక్షేమ మంత్రంతోనో అధికారంలోకి వచ్చేద్దామనే తంత్రాన్ని ప్రజలు ఈ మధ్య తిరస్కరిస్తున్నారు. ఈ సారి మహారాష్ట్రలో, జార్ఖండ్‌లో సంక్షేమ మంత్రం పనిచేస్తుందా? బీజేపీ పట్టు బిగిస్తుందా? కాంగ్రెస్ పుంజుకుంటుందా? శాసన సభ్యుల సంఖ్య ఆధారంగా న్యాయపరంగా శివసేన (ఏక్ నాథ్ షిండే) ఎన్సీపీ (అజిత్ పవార్)లకు గుర్తింపు లభించినా ప్రజాకోర్టులో తీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుంది? వంటి అనేక ప్రశ్నలకు నవంబర్ 20న ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారు.

# ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తి ఎంతో విలువైనది

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 04 : ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తి ఎంతో విలువైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎండి. దావూద్ సులేమాన్తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తి ఎంతో సమాజంలో గౌరవప్రదమైన స్థానం అని అన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 3వ బ్యాచ్ కొనసాగుతుందని, వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల విద్య పూర్తి చేసుకున్న తరువాత మెడికల్ సైన్స్ కోర్సుల్లో వివరాలు నమోదు చేసుకొని వైద్యులుగా బయటకు వెళతారని, ప్రాక్టీస్ చేసి ప్రజల వైద్య సేవలు అందించి జీవితాలను కాపాడుతారని, ప్రజలకు సేవ చేయడంలో మంచి అవకాశమని అన్నారు.ప్రభుత్వ వైద్య కళాశాలలో అన్ని సౌకర్యాలతో తరగతులు నిర్వహించి, అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా తరగతులు నిర్వహించడం జరుగుతుందని,అన్ని రకాల పరికరాలను సమకూర్చడం జరిగిందని తెలిపారు. వైద్య రంగంలో వైద్యుల విలువలు పాటించాలని, సమాజంలో గౌరవం పొందుతారని, ప్రొఫెసర్లు వైద్య విలువలు విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు.వైద్య విద్యలో విద్యార్థులకు ఒత్తిడి కొంచెం అధికంగా ఉంటుందని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి పిల్లలతో స్నేహ పూర్వకంగా మెదలాలని తెలిపారు.చదువుతో పాటు కళాశాల కార్యక్రమాలు, స్పోర్ట్స్ పాల్గొనాలని,ఒత్తిడిని తగ్గించుకొని చదువుపై ఏకాగ్రత పెంపొందించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, అధికారులు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తారని, ఇంకా ఏమైనా అవసరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,వైద్య విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ మున్సిపల్ పరిధిలో నవంబర్ 6నుంచి సమగ్ర ఇంటింటి సర్వే

## ఫార్మెట్ ప్రకారం నియమ నిబంధనలు వివరిస్తున్న అధికారులు




తూప్రాన్, నవంబర్, 4 ప్రజాబలం న్యూస్ :-మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలో నవంబర్ 6నుంచి సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించడానికి ఫార్మెట్ ప్రకారం నియమ నిబంధనలు వివరించడానికి అధికారులు తూప్రాన్ పురపాలక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న , సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయం మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) లో భాగంగా స్కూల్ ఎస్జీటీ టీచర్లకు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలకు, అంగన్వాడీ టీచర్లకు, నవంబర్ 6 నుండి నిర్వహించబడే సర్వేలో పాటించవలసిన నియమ నిబంధనలను గురించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తూప్రాన్ మండల ఎంఆర్ ఓ ఎస్.విజయలక్ష్మి, ఎంఈఓ పర్వతి సత్యనారాయణ లు పాల్గొని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. తేదీ:06-11-2024 నుండి నిర్వహించబోయే సర్వే కు పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు.

# నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 04 ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతుల వద్ద నుండి నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎండి. షాబొద్దీన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, ఎ.డి.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా మద్దతు ధర నిర్ణయించి రైతుల వద్ద నుండి వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లాలో 326 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.జి.ఓ. నం.27 ప్రకారం 33 రకాల ధాన్యానికి మాత్రమే 500 రూపాయలు బోనస్ వర్తిస్తుందని, సన్నరకం, దొడ్డురకం వడ్ల కొనుగోలుకు వేరువేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సన్నరకం ధాన్యం బస్తాకు ఎరుపు రంగు దారం, దొడ్డు రకం ధాన్యం బస్తాకు ఆకుపచ్చ రంగు దారం వినియోగించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో నిర్వహించవలసిన విధులపై స్వయం సహాయ సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వాలని, ప్రతి రోజు సాయంత్రం 8 గం?ల లోపు నివేదిక అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తూకంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే క్రమంలో తేమ, తప్ప, తాలు ఇతర అంశాలలో పాటించవలసిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, వచ్చే 2 రోజులలో బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలలోని రైతువేదికలలో సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు,నీడ, గోదాములు, టార్పాలిన్లు, గన్నీ సంచులు, తూకం, తేమ యంత్రాలు, ధాన్యం క్లీనర్లు ఇతర అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలించే సమయంలో రవాణా, ఎగుమతి దిగుమతిలో హమాలీల నిర్వహణ ఇతర అంశాలపై పర్యవేక్షించాలని, వర్షాభావ పరిస్థితులలో రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోలు కొరకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో 8 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం పత్తి మద్దతు ధర క్వింటాల్కు 7 వేల 521 రూపాయలు నిర్ణయించడం జరిగిందని, తేమ 8శాతం ఉంటే 7 వేల 671 రూపాయలు, 7 శాతం ఉంటే 7 వేల 596 రూపాయలు అందించడం జరుగుతుందని, 12 శాతం కంటే అధికంగా ఉంటే పత్తి కొనుగోలు చేయబడదని తెలిపారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతులు కొనుగోలు కేంద్రాలలో పత్తిని విక్రయించి లబ్ది పొందాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మిల్లులలో పత్తి నిలువ పేరుకుపోకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని,పత్తి మిల్లులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. పత్తి విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియ పూర్తి అయిన 7 రోజులలోగా ఆన్లైన్ ద్వారా సంబంధిత రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు,మొబైల్ నంబర్, బ్యాంక్ అనుసంధానం,పత్తి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో తేమ, తప్ప వంటి అంశాలలో పాటించవలసిన నియమాలు, కౌలు రైతుల ఒప్పంద పత్రాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా టోకెన్ వ్యవస్థ ఏర్పాటు చేసి వరుస సంఖ్యలు రైతులకు అందించాలని, ఆ ప్రకారముగా సకాలంలో వచ్చేలా వివరించాలని తెలిపారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలు అందించేందుకు 8897281111 నంబర్తో వాట్సాప్ చాట్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు, వివరాలు పొందేందుకు సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూలపాడు క్రికెట్ స్టేడియం కు త్వరలో మంచి రోజులు

## ఎంపీ కేసినేని శివనాద్ చిన్ని

ఇబ్రహీంపట్నం మూలపాడు గ్రామంలో గల గోకరాజు లైలా గంగరాజు క్రికెట్ స్టేడియాన్ని ఎంపీ కేశినేని శివనాద్ చిన్ని సోమవారం ఉదయం సందర్శించారు. క్రికెట్ స్టేడియంలో గల అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్, యు స్టోర్ రూముల శుభ్రత గా ఉండాలని స్టేడియం మేనేజర్ల పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత మీడియాతో మాట్లాడిన కేశినేని శివనాద్ మూలపాడు క్రికెట్ స్టేడియం కు త్వరలో మంచి రోజులు రానున్నాయని ప్రస్తుతం ఉన్న రెండు క్రికెట్ స్టేడియం లే కాకుండా అదనంగా మరొక పిచ్ ను కూడా ఏర్పాటు చేయటానికి అధికారులతో సంప్రదింపులు చేశామన్నారు. మూలపాడు వాసులకు మరో శుభవార్త చెప్పిన ఎంపీ కేశినేని శివనాద్ త్వరలో మూలపాడు గ్రామానికి మరో కొత్త క్రీడను తీసుకురాబోతున్నామని అదే గోల్ఫ్ కోర్టు అన్నారు దీనివల్ల ఇబ్రహీంపట్నం మండలంలోని దాదాపు 400 ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందిఅన్నారు. స్టేడియం కు వచ్చే రోడ్లను విస్తృతపరచాలని అందుకు కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు ఆదేశించారు ఈ మేరకు స్థానిక నాయకులు మూలపాడు క్రికెట్ స్టేడియం కి రావడానికి సుమారు మూడు దారులు ఉన్నాయని వాటిని అధికారులు ఆదేశిస్తే త్వరలో పూర్తిచేసే ఎలాంటి ఇబ్బంది లేకుండా క్రీడాకారులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయనున్నామన్నారు

# శాస్త్రవేత్తలకు ప్రేరణలు జాన్ బర్డన్ సండర్సన్ హాల్డేన్ పరిశోధనలు...

జాన్ బర్డన్ సండర్సన్ హాల్డేన్, జన్యు శాస్త్రంలో, అలాగే పరిణామ సిద్ధాంతంలో చేసిన కృషి ద్వారా శాస్త్రవేత్తలకు మార్గదర్శిగా నిలిచారు. 20వ శతాబ్దపు తొలి అర్ధభాగంలో ఆయన సృష్టించిన పరిశోధనల కారణంగా, జన్యు శాస్త్రం మరియు పరిణామానికి సంబంధించి అనేక నూతన ఆవిష్కరణలు, సిద్ధాంతాలు వెలుగులోకి వచ్చాయి.జె.బి.ఎస్. హాల్డేన్ 1892లో లండన్‌లో జన్మించారు. ఆయన తండ్రి డాక్టర్ జాన్ స్కాట్ హాల్డేన్ కూడా ప్రఖ్యాత శాస్త్రవేత్త, పరిశోధకుడు, వైద్యుడు. తన తండ్రి స్ఫూర్తితోనే హాల్డేన్ చిన్నప్పటి నుంచే శాస్త్రం పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఆయన ప్రాథమిక విద్యనంతా ఇంగ్లాండ్‌లోనే అభ్యసించి, ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో జీవశాస్త్రం, రసాయన శాస్త్రాలలో ప్రత్యేకత సాధించారు. ఆయన విద్యాభ్యాసంలో పొందిన పరిజ్ఞానం, పరిశోధన పట్ల ఉన్న మక్కువ అతన్ని ఒక గొప్ప శాస్త్రవేత్తగా తీర్చిదిద్దింది.హాల్డేన్ చేసిన ముఖ్యమైన పరిశోధనలలో జన్యువుల క్రియాశీలత ప్రాధాన్యత గలదిగా నిలిచింది. జన్యువులు జీవుల లక్షణాలను ఎలా నియంత్రిస్తాయి, వాటి ఆధారంగా వంశపారంపర్య లక్షణాలు ఎలా సంక్రమిస్తాయో విశదీకరించారు. ఈ పరిశోధనలకు ఆధారంగా, జెన్యు శాస్త్రంలో అనేక పరిశోధనలు ప్రారంభమయ్యాయి. డార్విన్ ప్రవేశపెట్టిన సహజ ఎంపిక సిద్ధాంతాన్ని హాల్డేన్ గణిత శాస్త్ర సూత్రాలతో వివరిస్తూ, పరిణామం ప్రక్రియను గణిత శాస్త్రీయంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఈ గణిత నమూనాలు పరిణామ ప్రక్రియలో సహజ ఎంపికను అర్థం చేసుకోవడంలో ముఖ్యపాత్ర పోషించాయి. ఆయన చేసిన గణిత శాస్త్ర విశ్లేషణ, తరువాతి కాలంలో జన్యు శాస్త్రం యొక్క గణిత నమూనాలకు బాటలు వేసింది.మానవ జన్యుశాస్త్రం రంగంలో కూడా హాల్డేన్ సాంకేతిక పరిజ్ఞానాలను అన్వయించారు. ఆయన మానవ జన్యు వైకల్యాలు మరియు వ్యాధులపై పరిశోధనలు చేశారు. జన్యు సమస్యలు ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతాయో ఆయన విశదీకరించారు. ఆయన పరిశోధనలు జన్యు వైకల్యాల పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. హాల్డేన్ పరిణామ శాస్త్రానికి గణితం ఎలా అన్వయించాలో ప్రాథమిక సూత్రాలు రూపొందించారు. ఆయన పనిచేసిన ముఖ్య అంశం, ప్రజలలో ఉన్న వేరియేషన్స్ సగటు జీవితకాలం, జన్యు వైవిధ్యాలకు సంబంధించిన గణిత నమూనాలను అర్థం చేసుకోవడం. ఈ గణిత నమూనాలు సహజ ఎంపిక ప్రక్రియలను సులభంగా అర్థం చేసుకోవడంలో తోడ్పడ్డాయి. హాల్డేన్ చేసిన ఈ కృషి, నేడు జన్యు శాస్త్రం అధ్యయనం చేసే శాస్త్రవేత్తలకు ప్రేరణగా ఉంది.హాల్డేన్ బహుముఖ ప్రతిభావంతుడు. శాస్త్రవేత్తగా కాకుండా సామాజిక సమస్యలపై కూడా విప్లవాత్మక దృక్పథం కలిగి ఉన్నారు. ప్రజలలో శాస్త్ర విద్యను ప్రోత్సహించాలని, శాస్త్రాన్ని సామాన్య ప్రజలకు చేరవేయాలని ఆయన ఆశించారు. రాజకీయంగా సైతం ఒక సామాజికవాది దృక్పథం కలిగి, శాస్త్ర పరిజ్ఞానం ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని విశ్వసించారు.హాల్డేన్ పరిశోధనలు పరిణామ శాస్త్రం మరియు జన్యు శాస్త్రంలో ఒక కొత్త దశను సృష్టించాయి. ఆయన ఆవిష్కరించిన సిద్ధాంతాలు తదుపరి శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలిచాయి. పరిశోధనలే కాకుండా శాస్త్ర విద్యను సామాజిక విప్లవానికి అన్వయించి, శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ప్రజల అభివృద్ధికి వినియోగించుకోవాలనే స్ఫూర్తిని అందించారు. జె.బి.ఎస్. హాల్డేన్ వంటి శాస్త్రవేత్తలు జన్యు శాస్త్రంలో గణనీయమైన మార్పులకు పునాది వేశారు. ఆయన పరిశోధనలు పరిణామ శాస్త్రానికి మైలురాయి, నేటి శాస్త్రవేత్తలకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

# ఆపన్నులకు అండగా రెడ్ క్రాస్

రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు వెనక ఒక మానవతా మూర్తి స్ఫూర్తి ఉంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ డునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితులకు డునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణించారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డారు. గాయపడిన వారికి సాయం అందకుండా, రక్షణ లేకుండా పోయిన హృదయ విదారక దృశ్యాలు కళ్ళారా చూశాడు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863 లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్న, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ మే 08, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. హెన్రీ డునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. హెన్రీ డునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్డి నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయ విదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు. యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... "యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇది మానవ ధర్మం." అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు.యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ.తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో, శాంతి కాలం లోను నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు...ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, త్రాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణ నివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది. 1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలు పరచాలని తీర్మానించ బడింది.1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి. 1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా – టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విడ్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్రౌండ్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణ మయినది. రెడ్ క్రాస్ ప్రైవేట్ సంస్థ కింద 1863 లో స్థాపించిన, అలాగే 1919 లో స్థాపింపబడిన, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ, అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య, స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలో ప్రధాన కేంద్రంగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. హెన్రీ డ్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థలన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు.

అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తాయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 నవంబర్లో 5న స్థాపించబడి, ఢిల్లీ ప్రధానకేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది.ఐఆర్‌సిఎస్ 1920 లో స్వచ్ఛంద మానవతా సంస్థగా స్థాపించబడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,100 కి పైగా శాఖల నెట్‌వర్క్‌తో, ఇది విపత్తులు , అత్యవసర సమయాల్లో సహాయం అందిస్తోంది, అలాగే పేదలు, బలహీనుల సంరక్షణను ప్రోత్సహిస్తుంది. ఇది ప్రపంచంలోని అతిపెద్ద స్వతంత్ర మానవతా సంస్థ, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ , రెడ్ క్రెసెంట్ ఉద్యమంలో ప్రముఖ సభ్యసంస్థ. భారత రెడ్‌క్రాస్ మిషన్ అన్ని రకాల మానవతా కార్యకలాపాలను చేపట్టడం, ప్రోత్సహించడం చేస్తోంది.. మానవాళి బాధలను తగ్గించవచ్చు , నివారించవచ్చు తద్వారా శాంతికి మరింత సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదం చేస్తుంది.

# 'సునామీ'లపై అవగాహన ఆవశ్యకత

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో "వరల్డ్ సునామీ అవేర్నెస్ డే" వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో "ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం" కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5%-%6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళ్తుంటాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే 'విజ్ఞాన వాహిని' భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి "ఓషియన్ స్టేట్ ఫోర్కాస్ట్ సేవలను" ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల ద్వారా సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

# రాహుల్ గాంధీని దేశం నమ్ముతుంది

రాహుల్, కుల గణన ఎజెండాతో ఎలుగెత్తి చాటు తుంటే కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం రాహుల్ ఇమేజ్ డ్యామేజ్ చేస్తుంది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కుల గణ నపై ఒక్క అడుగు ముందుకేసి రాహుల్ ఆలోచనని బలపరచింది. ఇంకా చాలా విషయాల్లో రాహుల్ ఆలోచనతో ముందుకు వెళితే ఫలితాలు అనుకూలిస్తాయి. గడిచిన 3 దశాబ్దాల కాలంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో వచ్చిన రాజకీయ మార్పులు ఏమి లేవు. పాత మూస పద్ధతులతో స్థానిక ఆధిపత్య వర్గాల నిర్మాణంలోనే కాంగ్రెస్ కొనసాగడం ఆ పార్టీకి తీరని నష్టం చేసింది. కానీ మరోవైపు భారతీయ జనతా పార్టీ సోషల్ ఇంజనీరింగ్ ద్వారా అన్ని వర్గాలను ప్రభావితం చేస్తూ బలమైన పార్టీగా ఎదిగింది. కాంగ్రెస్ మాత్రం కేవలం పార్టీ నిర్మాణాన్ని కొన్ని కుటుంబాల చేతిలో పెట్టి అన్ని వర్గాలకు దూరం అయింది. భారతీయ జనతా పార్టీలో మోడీ నాయకత్వం బలపడ్డ కొద్ది రాహుల్ గాంధీ ఇమేజ్ గ్రాఫ్ తగ్గుతూ వచ్చింది. రాహుల్ నాయకత్వం వరుస ఓటములు చవిచూడటం, ఇటు పార్టీలో అటు సోషల్ మీడియాలో రాహుల్ ఇమేజ్‌కు పెద్ద గండి పడింది. అయితే వరుస అపజయాలకు రాహుల్ ఎన్నడూ కృంగిపోలేదు, చాలా హుందాగా ఓటమికి నైతిక బాధ్యత వహించాడు. అపజయాల నుండి విజయానికి బాటలు ఎలా వేయాలో అధ్యయనం చేశాడు.కాంగ్రెస్ పార్టీకి ఎన్ని అపజయాలు ఎదురైన మొక్క వోని దీక్షతో ముందుకే సాగాడు. పార్లమెంట్ లోపల బయట కాంగ్రెస్ ఉనికిని నిలబెట్టే ప్రయత్నం గట్టిగా చేశాడు. కాంగ్రెస్ పార్టీని బలమైన భావజాలం మాత్రమే నిలబెట్టగలుగుతుందని నమ్మాడు, ఆచరించాడు. అందుకు కావలసిన మేధోమథనం చేశాడు. నిపుణులతో చర్చించాడు. మేధా వుల వద్ద ఆలోచనలు పంచుకున్నాడు. దేశంలోని సోషలిస్టులు, అంబేద్కర్ వాదులు, బుద్ధిస్ట్‌లు, కమ్యూనిస్టు మేధావుల వద్ద ఆధునిక రాజకీయ శాస్త్రాన్ని అధ్యయనం చేసారు. అందుకే లౌకికవాద నినాదం సరిపోదని గ్రహించి సామాజికన్యాయం ఎజెండాను బుజాలకెత్తుకున్నాడు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం అనే రెండు ప్రధాన రాజకీయ సూత్రాలను కాంగ్రెస్ పార్టీ ఎజెండాలో చేర్చాడు. దేశ రాజకీయాల్లో ఏ రాజకీయ నాయకు డు చేయని సాహసాన్ని భారత్ జోడో యాత్ర ద్వారా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు నిర్వహించాడు. దేశంలో బలమైన భావజాలాన్ని మరో బలమైన భావజాలం మాత్రమే సమాధానం చెబుతుందని రాహుల్ గాంధీ విశ్వసించాడు, ఆచరించాడు. ఆయన కృషి కొంతవరకు ఫలించింది. అనుకూల ఫలితాలు కాంగ్రెస్ ఖాతాలో పడుతున్నాయి. అయితే, రాహుల్ ఉపన్యాసాలు కార్యక్రమాలు ప్రజలను ప్రభావితం చేసినంతగా కాంగ్రెస్ నేతలను ప్రభావితం చేయలేకపోవడం విషాదం. రాహుల్ మాట్లాడుతున్న రాజకీయ భాష మావోయిస్టుల భాష అని సాక్షాత్తూ భారత ప్రధాని అంటున్నారంటే ఆయన ఇమేజ్ రాహుల్ ప్రభ ఎంతమేర పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పు డు మారాల్సింది కాంగ్రెస్ నాయకత్వమే. మొత్తం కాంగ్రెసు పార్టీలో రాహుల్ రాజకీయ పరిభాషను అర్థం చేసుకొని ఆచరణలో పెట్టే నాయకత్వం కనుచూపు మేరలో కనిపించకపోవడం ఆ పార్టీ సంబంధించినంత వరకు బావ దారిద్ర్యమే. అఖిల భారత కాంగ్రెస్ నుండి తెలంగాణ కాంగ్రెస్ వరకు ఒక్కరంటే ఒక్క నేత కూడా రాహుల్ రాజకీయ వ్యూహాన్ని అర్థం చేసుకున్నట్టు కనిపించరు. సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తి, ఉపాధి కల్పన, నిరుద్యోగం తదితర మౌలిక అంశాలపై రాహుల్ తప్ప ఒక్క నేత కూడా నోరు మెదపరు. కాంగ్రెస్ పార్టీకి దక్షిణాదిన బూస్టింగ్ ఇచ్చిన కర్ణాటక, తెలంగాణలో రాహుల్ ఆలోచన ఎంతవరకు ఆచరణ రూపు దాల్చుతుందన్నది మీడి యాలో కథనాలు చూస్తున్నాం. కులగణన ఎజెండాతో రాహుల్ ఎలుగెత్తి చాటుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం నిమ్మ కు నీరెత్తినట్టు ఉండటం ఇమేజ్ డ్యామేజ్ చేస్తుంది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కుల గణనపై ఒక్క అడుగు ముందుకేసి రాహుల్ ఆలోచనని బలపర్చింది. ఇంకా చాలా విషయాల్లో రాహుల్ ఆలోచనతో ముందుకు వెళితే ఫలితాలు అనుకూలిస్తాయి. ఒకవైపు సామాజిక న్యాయంపై రాహుల్ పోరాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం పాత పద్ధతులు అవలంభిస్తున్నాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రాహుల్ రాజకీయ ఎజెండాను ఆచరణలో పెడితే రాహుల్ పరపతి పెరుగుతుంది. రాహుల్ ఆలోచనలకు భిన్నంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాలన సాగితే కాంగ్రెస్ పార్టీ తీరని నష్టం జరుగుతుంది. బలమై న భావజాలాన్ని మరో బలమైన భావజాలం మాత్ర మే ఎదుర్కోగలుగుతుందన్న సత్యాన్ని రాహుల్ గ్రహించాడు. అలాగే ఆయన ప్రధాన నాయకత్వం కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు దీనిని గ్రహించినప్పుడు మాత్రమే కాంగ్రెస్ బలపడుతుంది. లేకపోతే హర్యానా ఫలితాలే పునరావృతం అవుతాయి. హర్యానా ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు గుణపాఠం. రాహుల్ గాంధీ రాజకీయంగా పరిణతి చెందాడని దేశం నమ్ముతుంది మారాల్సింది కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే.

# స్మార్ట్ కార్డుల్లో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు

రాజమండ్రి, నవంబర్ 4, కొత్త వెహికల్స్ కొనేవారికి, లైసెన్స్‌లు తీసుకునేవారికి రాష్ట్రం ప్రభుత్వం శు భవార్త చెప్పింది. ఇకపై డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలు స్మార్ట్ కార్డుల్లో ఇవ్వనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పనుంది. రాష్ట్రంలో ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్ లు స్మార్ట్‌కార్డుల్లో రానున్నాయి. కొత్త వెహికల్స్ కొనేవారికి, లైసెన్స్‌లు తీసుకునేవారికి రాష్ట్రం ప్రభుత్వం శు భవార్త చెప్పింది. రాష్ట్రంలోని రవాణా శాఖలో స్మార్ట్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం అయింది. స్మార్ట్ కార్డుల సరఫరాకు టెండర్ల పిలిచేందుకు ప్రక్రియ మొదల పెట్టింది.కొత్త వాహనం కొనుక్కుని, రవాణా శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక ఇచ్చే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్ పొందినప్పుడు అందజేసే డీఎల్ కార్డుల జారీకి ప్రక్రియ ప్రారంభం అయింది. నవంబర్ నెల నుంచే కార్డులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో రోజుకు సగటున 10-12 వేల ఆర్సీ, డీఎల్ కార్డుల చొప్పున నెలకు మూడు లక్షలు, ఏడాదికి దాదాపు 36 లక్షల కార్డులు అవసరం అవుతాయి. గతంలో జిల్లా రవాణా శాఖ, ఆర్టీవో కార్యాలయాల్లో వాటిపై వివరాలు ముద్రించి, వాహనదారుల ఇళ్లకు స్పీడ్ పోస్టులో పంపేవారు. దీనికోసం రూ.200 ఫీజు, స్పీడ్ పోస్టు ఖర్చు కూడా వసూలు చేసేవారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ కార్డుల జారీకి రవాణా శాఖను ఆదేశించింది. నవంబర్ మొదటి వారం నుంచి వాహన్, సారథి పోర్టల్‌లో ఈ కార్డుల కోసం ఆప్షన్ ఇవ్వనున్నారు. దీనికి రూ.200 ఫీజుతో పాటు, స్పీడ్‌పోస్టు ఛార్జి రూ.35 ఆన్‌లైన్‌లోనే తీసుకుంటారు. స్మార్ట్ కార్డుల సరఫరాకు టెండర్లు పిలిచేందుకు రవాణా శాఖ దస్త్రం సిద్ధం చేసింది. దానిని ప్రభుత్వానికి పంపింది. అక్కడి నుంచి క్లియరెన్స్ రాగానే టెండర్లు పిలిచి, సరఫరాదారును ఎంపిక చేస్తారు.జూలై నుంచి ఈ విధానాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్‌సీతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆన్‌లైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని జెరాక్స్ కాపీ వాహనదారుల వెంట ఉంచుకుంటే సరిపోతుందని ఆదేశాలు ఇచ్చింది. కాకపోతే వాహనదారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడ తనిఖీల సమయంలో ఆర్సీ, డీఎల్ కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మళ్లీ స్మార్ట్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమైంది.దీంతో వాహనదారుల జోబుల్లో మరోకార్డు పెరగనుంది. వర్షాలు వచ్చే సమయంలో ఇబ్బందులు పడనక్కరలేదు. ఇది వరకు కాగితపు ధ్రువీకరణ పత్రం వర్షాలు పడితే తడిచిపోయేది.

# జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు



విజయవాడ, నవంబర్ 4, )కొత్త రేషన్ కార్డులపై ఏపీ సర్కార్ అప్డేట్ ఇచ్చింది. జనవరి నుంచి కొత్త రేషన్ కార్డుల జారీకి కసరత్తు చేస్తుంది. అలాగే పాత కార్డుల స్థానంలో కొత్త డిజైన్ తో కార్డులు జారీ చేయనున్నారు. వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది.కొత్త రేషన్ కార్డుల జారీపై ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనుంది. కొత్తగా పెళ్లైన వారితో పాటు అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ప్రస్తుత కార్డుల రీడిజైన్ తో పాటు కొత్త లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది.ఏపీలో ప్రభుత్వం 1 కోటి 48 లక్షల వైట్ రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిల్లో 90 లక్షల కార్డులు జాతీయ ఆహార భద్రత చట్టం కింద కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ కార్డులకు మాత్రమే కేంద్రం ఉచితంగా బియ్యం, తక్కువ ధరకు కందిపప్పు, పంచదార ఇతర సరుకులు అందిస్తుంది. మిగిలిన కార్డులకు అందిస్తున్న ఉచిత బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, ఇతర సరుకులకు అయ్యే రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఈ కార్డులను కూడా జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని చాలా కాలంగా కోరుతుంది. అయితే కేంద్రం నుంచి స్పందనలేదు.ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత... రాష్ట్రానికి ఆర్థికభారం కాకుండా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల వినియోగంపై సమీక్షలు చేస్తుంది. పౌరసరఫరాల శాఖ డేటా ఆధారంగా రాష్ట్రంలోని 17,941 అంత్యోదయ అన్న యోజన కార్డుదారులు, మరో 1,36,420 పీహెచ్‌హెచ్ కార్డుదారులు... గత ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. ఈ కార్డులు తొలగిస్తే ఏడాదికి రూ.90 కోట్ల వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తుంది. వీటి స్థానంలో అర్హులైనవారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయవచ్చని ప్రభుత్వం ఆలోచన చేస్తుందిప్రభుత్వంపై అదనపు భారం పడకుండా 1.5 లక్షలకు పైగా పేద కుటుంబాలకు వచ్చే ఏడాది జనవరిలో కొత్త రేషన్‌కార్డులు జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళికలు వేస్తుంది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో... రేషన్ కార్డుల రూపురేఖలు మార్చారు. బియ్యం కార్డులు సైతం జారీ చేశారు. రేషన్ కార్డులపై వైఎస్ జగన్, రాజశేఖర్ రెడ్డి ఫొటోలు ఉండేవి. రాష్ట్రంలో కూటమి పార్టీ అధికారంలోకి రావడంతో...రేషన్ కార్డుల డిజైన్లు మారనున్నాయి. లేత పసుపు రంగు కార్డుపై ప్రభుత్వ అధికారిక చిహ్నం ఉన్న రేషన్ కార్డు నమూనాను పౌరసరఫరాల శాఖ ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది.ప్రభుత్వం వద్ద కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు సహా మార్పు చేర్పులు కోసం భారీగా కార్డులు పెండింగ్ లో ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం 30,611 దరఖాస్తులు, కార్డుల స్ప్లిట్ కోసం 46,918 దరఖాస్తులు, సభ్యులను యాడ్ చేసేందుకు 2,13,007 దరఖాస్తులు, తొలగింపు కోసం 36,588, అడ్రస్ మార్పు కోసం 8,263, సరెండర్ కోసం 685 దరఖాస్తులు... మొత్తంగా 3.36 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

# రామచేప రేటే వేరప్పా....

కాకినాడ, నవంబర్ 4, పులస చేప తెలుగు రాష్ట్రాల్లో ఎంత ఫేమసో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గోదావరికి వరదనీరు వచ్చినప్పుడు జాలర్లకు చిక్కే ఈ చేపలు.. వారి దండిగా కాసులను అందిస్తాయి. జులై నుంచి అక్టోబర్ వరకు పులసలు చిక్కుతూ ఉంటాయి. రుచితో పాటు ఎన్నో పోషక విలువలు ఈ చేప సొంతం. పల్లెటూర్లలో ఎవరైనా పులస.. కొని వండుకున్నారంటే.. ఊరంతా ఆ విషయాన్ని ఆ రోజు గొప్పగా చెబుతుంటారు. అది పులస రేంజ్. ఇక పులస మాదిరిగానే.. గోదావరి జిల్లాల్లో 'రామ చేప' కూడా చాలా పాపులర్. వీటికి కూడా మంచి డిమాండ్ ఉంటుంది. రామ చేపలు చూడటానికి బొమ్మిడాయిలు మాదిరిగానే ఉంటాయి. టేస్ట్ అయితే పులసల లాగానే ఉంటుందట. ఈ చేపలు 5 నుంచి 7 అంగుళాలు ఉంటాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉప్పుటేరు పరివాహక ప్రాంతాల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఈ చేపల లభ్యత ఉంటుందిరామల చేపలు.. కిలోకు 40 వరకు తూగుతాయి. కానీ వీటిని పీస్‌ల లెక్క అమ్ముతూ ఉంటారు. సాధారణంగా రామలు ధర ఒక్కోటి రూ.25 వరకు ఉంటుంది. కానీ ప్రారంభ సీజన్‌లో ఒక్కోటి రూ.30కు పైనే పలుకుతుంది. డిమాండ్‌ను బట్టి ఒక్కోసారి రూ.40 నుంచి రూ.50 పలుకుతుంది. ఈ చేపలను మన దగ్గర తినడమే కాకుండా.. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తారు. మసాలా దట్టించి ఇగురు పెట్టినా.. ఇదే సీజన్‌లో కాసే లేత చింతకాయలతో కలిపి పులుసు పెట్టినా.. ఆ రుచి అమోఘం అంటున్నారు మాంసాహార ప్రియులు. చింతకాయలతో కలిపి వీటిని కూర వండితే ఆ వాసన ఊరి పొలిమేర దాటాల్సిందేనట.

# వైసీపీ సైలెంట్ ప్లానింగ్....



విశాఖపట్టణం, నవంబర్ 4, మొన్నటి వరకు సైలెంట్ గా ఉన్న వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా నేడు కూటమిపై విమర్శల జోరు సాగిస్తున్నారు. ఎన్నికల ఫలితాల షాక్ నుండి ఇప్పుడిప్పుడే వైసీపీ నేతలు కోలుకుంటున్నారని చెప్పవచ్చు. కేవలం 11 సీట్లకే వైసీపీ పరిమితం కాగా, మాజీ సీఎం జగన్ ఇటీవల నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలన కాలంలో అంతా తానై ముందుండి నడిపించిన సజ్జల రామకృష్ణారెడ్డి కొద్దిరోజులు సైలెంట్ అయ్యారు. ఇటీవల టీడీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి పోలీసుల విచారణకు సజ్జల హాజరయ్యారు.అప్పుడు కనిపించిన సజ్జల, తాజాగా కూటమి ప్రభుత్వం లక్ష్యంగా విమర్శల స్పీడ్ పెంచారని చెప్పవచ్చు. ఆదివారం తిరుపతిలో జరిగిన వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్న సజ్జల మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదని, వాటి బదులుగా నిత్యం ఏదో ఒక అరాచక ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కక్షపూరిత రాజకీయాలకు ఊతమిచ్చే విధంగా వైసీపీ నేతలపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతుందన్నారు. ఇసుక, మద్యం మాఫియాలకు అడ్డు లేకుండా పోయిందని, ఎవరికి తోచినంత వారు దోచుకుంటున్నారని విమర్శించారు.ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు, ప్రస్తుతం సైలెంట్ అయ్యారన్నారు. ఒకటో, రెండో పథకాలు అమలు చేసి తాము హామీలను నెరవేర్చాం అంటూ కూటమి నేతలు జోరుగా ప్రచారం సాగిస్తున్నారన్నారు. కేవలం 5 నెలల్లో ప్రభుత్వం రూ.53 వేల కోట్ల అప్పు చేసిందని, కానీ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదన్నారు. త్వరలోనే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, పార్టీ కార్యకర్తలు అందుకు సిద్దంగా ఉండాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని సజ్జల అన్నారు.మాజీ మంత్రి పేర్ని నాని మాత్రం ఈసారి కూటమిపై ఘాటుగా కామెంట్స్ చేసి, విరుచుకుపడ్డారనే చెప్పవచ్చు. ముగ్గురు కాదు ముప్పై మంది వచ్చినా వైసీపీకి వచ్చే నష్టం లేదని, తమ పార్టీ కార్యకర్తలు ధైర్యంగా పార్టీ కోసం శ్రమించి, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయాన్ని అందిస్తారన్నారు. ఎప్పుడూ ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలు చేయని నాని ఈసారి మోదీ కూడా చంద్రబాబు, పవన్ లతో కలిసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, చాలా వరకు నేతలు, అధికారులు ఓవర్ యాక్షన్ చేస్తున్నారని, అటువంటి వారిని తమ పార్టీ అధికారంలోకి వస్తే, వదిలిపెట్టేది లేదని ఓ రేంజ్ లో నాని హెచ్చరించారు. అధికారంలో ఉన్నాం.. వైసీపీని అణచివేద్దాం అనుకుంటూ కూటమి నేతలు అడుగులు వేస్తున్నారని, అణచివేస్తే తలొగ్గే పార్టీ తమది కాదన్నారు.అలాగే చిత్తూరు సభలో వైసీపీ ఎంపీ విజయసాయి మాట్లాడుతూ.. జమిలీ ఎన్నికల గురించి జోస్యం చెప్పారు. 2027 చివరిలో ఎన్నికలు రాబోతున్నాయని, ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చిత్తూరులోని 14 నియోజకవర్గాల గెలుపు బాధ్యత భూమన కరుణాకర్ రెడ్డికే అప్పగిస్తున్నట్లు, కార్యకర్తలను ప్రాణంగా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక నేతలదే అంటూ విజయసాయి సూచించారు.ఇలా జమిలీ ఎన్నికల వార్తల నేపథ్యంలో వైసీపీ స్పీడ్ పెంచి అన్ని జిల్లాల క్యాడర్ ను బలోపేతం చేస్తుండగా, కూటమి మాత్రం పరిపాలనపై పూర్తి దృష్టి సారించి ఇచ్చిన ఒక్కొక్క హామీని నెరవేర్చే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే దీపావళి కానుక కింద ఉచితంగా మూడు సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా, త్వరలోనే మహిళలకు ఫ్రీ బస్ స్కీమ్ కూడా అమలులోకి తెచ్చే కార్యాచరణలో ప్రభుత్వం నిమగ్నమైనట్లు సమాచారం.

# రైతులను ఆదుకోవాలి వంటేరు ప్రతాప్ రెడ్డి .



**మెదక్ తూప్రాన్ ప్రజాబలం న్యూస్:**-గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎఫ్ డి సి చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో సోమవారం ప్రతాప్ రెడ్డి పర్యటించారు. ఇటీవల మరణించిన వడ్డే రాజు కుటుంబాన్ని అలాగే ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పూరి గుడిసె దగ్ధమైన ఎర్ర భూదమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటివరకు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆసనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే జాతీయ రహదారులపై రైతులు పండించిన ధాన్యంతో రాస్తారో ఒక చేస్తామని ప్రతాపరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపిటిసి సంతోష్ రెడ్డి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ గోపి నాయక్, నాయకులు చంద్రం, స్వామి, బాబు, సత్యం, రాజు, పరమేశ్వర్, కృష్ణ, యాదగిరి, సాయిలు, జముల నాయక్, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయి

## తార్నాక నారాయణ పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్

## ముఖ్య అతిధిగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నవంబర్ 4:**క్రీడల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. తార్నాక నారాయణ పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, నారాయణ విద్యాసంస్థల,డీజీఎం గోపాల్ రెడ్డి, ఏజిఎంబాల పరమేశ్వర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోనే కాక, క్రీడా రంగాలలో కూడా ముందుకు రావాలని వారి యొక్క ప్రతిభను క్రీడారంగంలో చూపిస్తూ విజయ వంతులుగా నిలవాలన్నారు. ఎంతో మంది క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని, విద్యార్థుల యొక్క నైపుణ్యాలను గుర్తించడం కోసం వారి యొక్క ప్రతిభను అందరికీ తెలిసేలా ఇలాంటి స్పోర్ట్స్ మీట్ పాఠశాలలో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. మాటలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ లక్ష్మీ గోతి, సాఫ్ట్ స్కిల్స్ యోగేందర్, హైస్కూల్ కో- ఆర్డినేటర్ఆజాద్, ఈ-చాంప్స్ కో ఆర్డినేటర్ లక్ష్మీ భవాని,ఈ- కిడ్జ్ కో ఆర్డినేటర్ నూర్, పాఠశాల ప్రిన్సిపాల్పర్వేన్, ఏ.ఓ. మహేందర్, పి.ఇ.టి. నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# తూప్రాన్ శివాలయంలో కార్తీక దీపారాధన

## కార్తీక మాసం మొదటి సోమవారం ఆకాశ దీపం

## కార్తీక దీపాలతో హాజరైన మహిళా భక్తులు



**తూప్రాన్, నవంబర్, 4.** మెదక్ జిల్ల తూప్రాన్ పట్టణంలోని గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మున్సిపాలిటీ కేంద్రం శివాలయంలో కార్తీక ఆకాశ దీపం కు ఆలయ ప్రధాన అర్చకులు మధు పంతులు ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేధమంత్రొచ్చారణల మధ్య శివాలయం లో ధ్వజ స్థంభం పైకి ఆకాశ దీపం ఎక్కించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తూప్రాన్ పట్టణంలోని మహిళా భక్తులు పిండితో చేసిన దీపం ప్రమిదలను ఆలయం ధ్వజ స్థంభం ఆవరణలో వెలిగించి పరస్పరం పసుపు బొట్టు ఇచ్చుకొన్నారు.

అనంతరం ఆలయంలో 11 ప్రదక్షిణలు చేసి పరమాన్నం, అట్లు,స్వీట్లు, నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివాలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. ఆలయం మొత్తం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలో ఉన్న ఉసిరి చెట్టు, ఏక బిల్వం చెట్టుకు ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. సోమవారం ఉదయం నుంచే అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బజారు వంశస్తులు భారీ ఏర్పాట్లు చేశారు.



# సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వం

## రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు కృతజ్ఞతలు

## - మేకల మారుతి యాదవ్

కమాన్ పూర్‌తెలంగాణలో యాదవుల అతి ముఖ్యమైన జీవనాధారం అయినా పాడి పరిశ్రమ, ఆ జీవాలతో యాదవుల జీవితంలో విడదీయరాని అనుబంధం ఉంటుంది దానికి గుర్తుగా దీపావళి పండుగ తర్వాత రెండో రోజు జరుపుకొనే పాడి పరిశ్రమకు సంబంధించిన జీవాలను అలంకరించి వాటిని పూజించే సంప్రదాయం స్వాతంత్రం రాకముందు నిజాం కాలం నుంచి కొనసాగుతుంది.అట్టహాసంగా జరుపుకునే యాదవుల సదర్ సమ్మేళనాన్ని పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు శనివారం నవంబర్ 02న రోజున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సదర్ సమ్మేళనాన్ని ప్రతి ఏడాది రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను శాంతి కుమారి ఆదేశించారు. ఇట్టి గొప్ప నిర్ణయాన్ని తీసుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారికి, రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు గారికి యాదవ సమాజం పక్షాన మేకల మారుతి యాదవ్ శనర్థులు తెలియజేశారు. యాదవులందరూ ఐక్యతతో ఉండి సదర్ సమ్మేళనాన్ని ప్రతి గ్రామ గ్రామాన పండగల నిర్వహించాలని కోరారు.



# దెందులూరులో టీడీపీ వర్సెస్ జనసేన

ఏలూరు, నవంబర్ 4, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక నియోజకవర్గాల్లో మిత్ర పక్షాల మధ్య విభేదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆధిపత్య పోరు నడుస్తుంది. మద్యం దుకాణాల కేటాయింపు, ఇసుక సిండికేట్లు, నామినేటెడ్ పదవుల విషయంలో ఇలా ప్రతి విషయంలో ఒకరినొకరిపై విమర్శలు చేసుకుంటున్నారు. ప్రధానంగా కూటమి పార్టీలు స్వీప్ చేసిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఈ ఆధిపత్య పోరు ఎక్కువగా కనపడుతుంది. ఇటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, అటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు వెళుతున్నప్పటికీ కూటమి నేతల మధ్య విభేదాలు పార్టీ అధినేతలకు తలనొప్పిగా మారాయి.. ప్రధానంగా పింఛన్ల పంపిణీ విషయంలో కూడా ఈరోజు అనేక నియోజకవర్గాల్లో కూటమి పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. తాము పింఛను పంపిణీ చేయాలని ఒకరంటే.. తాము కూడా భాగస్వామ్యులవుతామని జనసేన నేతలు కూడా రెడీ అవుతుండటంతోనే ఈ పరిస్థితులు తలెత్తాయి. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి మీరెవ్వరంటూ టీడీపీ నేతలు జనసేన నేతలను ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో కలసి పోటీ చేసి, అభ్యర్థి విజయానికి ఇద్దరూ కృషి చేసినప్పటికీ, తర్వాత మాత్రం అనేక అంశాలు విభేదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విభేదాలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చినట్లు తెలిసింది.పశ్చిమ గోదావరి జిల్లాలోని దెందులూరు, చింతలపూడి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. వీరు ఒకరినొకరు వీధుల్లోకి వచ్చి తిట్టుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. ఇది పెద్ద పంచాయతీగా మారింది. అయితే దెందులూరులో విభేదాలపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పందించారు.కొన్ని అరాచక శక్తులు ఇటీవలే జనసేనలో చేరారని,పబ్బం గడుపుకోవడానికే వాళ్లు పార్టీలో చేరారని చింతమనేని అన్నారు .చేరినవాళ్లు చేరినట్టు ఉంటే మంచిదని,పెన్షన్ల పంపిణీతో వాళ్లకు సంబంధమేంటని ఆయన ప్రశ్నించారు.గ్రామాల్లో గొడవలు పెట్టే సంస్కృతి మానుకోవాలని కోరారు.ఆ రోజు కూటమి ఓటమికి ప్రయత్నించింది వీళ్లేనని, ఇప్పుడుపార్టీలో చేరి అధికారం చెలాయిస్తామంటే కుదరదని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. జనసేన అధినాయకత్వంతో తాను మాట్లాడతానని చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

విజయనగరం నెల్లిమర్లలోనూ....

వైసీపీ హయాంలో జనమంతా విసిగిపోయారు. ప్రభుత్వం మారాలనే ఉద్దేశంతో ఏపీలో కూటమి నేతలు ఒక్కటై పనిచేశారు. ఊహించిన దానికంటే అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నారు. కలసి పనిచేస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు.. రానురాను మితిమీరుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో అయితే.. నువ్వా-నేనా అన్నట్లుగా పరిస్థితి ఉందని.. సొంత పార్టీల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే లోకం మాధవి వర్సెస్ టీడీపీ ఇన్‌ఛార్జ్ బంగార్రాజుగా మారిందట. ఇప్పటివరకూ లోలోపలే తన్నులాడుకున్న వారు.. ప్రస్తుతం రోడ్డెక్కారనే టాక్ బలంగా వినిపిస్తోంది.విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం కూటమిలో కుమ్ములాటలు బహిర్గతం అవుతున్నాయట. మొన్నటి వరకూ లోలోపలే కత్తులు దూసుకున్న నాయకులు నేడు బహిరంగంగానే బాహాబాహీకి దిగుతున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి విభేదాలు చేరుకున్నాయట. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ అనికూడా చూడకుండా బంగార్రాజును లోకం మాధవి అవమానించారట. యాఎని పిలిచి? ఇతనిని బయటకి పంపించాలంటూ హుకుం జారీ చేయటంతో నగర పంచాయతీ సమావేశంలో ఆయన కంగుతున్నారట. తర్వాత కుదుటపడి. బంగార్రాజు కూడా ఎమ్మెల్యేకి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారట. తాను ఆహ్వానం మేరకే సమావేశానికి వచ్చానని.. దానిపై తనకు క్లారిటీ ఉందని బదులు ఇవ్వటంతో సమావేశం కాస్తా హీట్‌గా మారిందట.నియోజకవర్గంలో ఇలాంటి గొడవలు కొత్తేమీ కాదట. ఇటీవల చింతలవలస రోడ్డు శంకుస్థాపన అంశంలోనూ ఇలాంటి సీన్ జరిగిందట. శంకుస్థాపన కార్యక్రమానికి తమకెందుకు ఆహ్వానం ఇవ్వలేదని తెలుగు తమ్ముళ్లు.. జనసేన ఎంపీపీని అడ్డుకున్నారు. కూటమిలో అందరం కలసి పనిచేస్తేనే గెలుపు సాధ్యమైందని అలాంటపుడు తమను ఎలా పక్కన పెడతారనేది టీడీపీ వాదనగా తెలుస్తోంది. మమ్మల్ని పిలవకుండానే.. మీరే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారా అని ప్రశ్నించటంతో కాస్త ఉద్రిక్తత వాతావరణం నెలకొందట. దీంతో సదరు ఎంపీపీ వెనక్కి వెళ్లిపోయారు. ఈ పంచాయితీ అక్కడితో ఆగలేదు. ఇదే విషయాన్ని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కూడా చేసేదేం లేక.. విభేదాలు లేకుండా పని చేయాలని సూచనలు మాత్రమే చేశారట.మరోవైపు.. తెలుగుదేశం కూడా జనసేకు షాకులిస్తూనే ఉందట. మార్క్ ఫెడ్ ఛైర్మన్ అయ్యాక ఏర్పాటు చేసిన సభకి ఎమ్మెల్యే లోకం మాధవికి ఆహ్వానం లేదట. కేవలం టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలను మాత్రమే ఆహ్వానించారు . ఇలా ఎప్పటికప్పుడే కూటమిలో కుమ్ములాటలు బహిర్గతం అవుతున్నాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు.. కర్రోతు బంగార్రాజును కూడా ఎక్కడా తగ్గవద్దని.. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, విశాఖ ఎంపీ భరత్.. హింట్ ఇచ్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి. కనీసం ఓటు బ్యాంక్ లేని వాళ్లని ఎమ్మెల్యేగా చేస్తే? రివర్స్ అవ్వటం ఏంటని టీడీపీ సీనియర్లు సైతం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందే ఊహించిన మాధవి.. కేడర్‌ను పెంచుకునే పనిలో పడ్డారట. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారనే టాక్ బలంగా వినిపిస్తుంది . తనకి నియోజకవర్గంలో తగిన బలం ఉండాలనే తపనలో ఆమె ఉన్నారని తెలుస్తోంది. నెల్లిమర్లలో టీడీపీని తట్టుకొని నిలబడాలంటే.. సీనియర్ నాయకుల అవసరం ఉందని గ్రహించిన మాధవి.. వైసీపీ సీనియర్లకు గాలమేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. జనసేనాని అండదండలు కూడా మాధవికి.. బలంగానే ఉన్నాయనే టాక్ ఉంది. జనసేన పార్టీకి మాధవి ఫండింగ్ చేస్తుండడం వల్లే ఆమెకు అంత ప్రాధాన్యత అనే విమర్శించిన వాళ్లూ నియోజకవర్గంలో ఉన్నారట.బంగార్రాజు-మాధవి వ్యవహార శైలితో.. లోకల్ లీడర్లు ఏం చేయాలనే ఆలోచనలో పడ్డారట. ప్రభుత్వంలో కంటే ప్రతిపక్షమే బెటర్ అనే ఫీలింగ్‌తో కొందరు ఉన్నారంటే.. నెల్లిమర్లలో పరిస్థితి ఏంటనేది తెలుస్తోంది. టీడీపీ నాయకులకు ఎలాంటి పనులు చేయవద్దని మాధవి ఇప్పటికే అధికారులకు హుకుం జారీ చేశారన్న టాక్ వినిపిస్తోంది. తాను చెప్పిన నాయకులు వస్తేనే పనులు చేయాలంటూ ఎమ్మెల్యే చెప్పటంతో వివాదం కాస్తా ఎక్కువ అవుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గొడవలు ముదరకముందే.. రెండు పార్టీల అధినేతలూ పిలిపించి మాట్లాడితే తప్ప పరిస్థితిలో మార్పు రాదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

# గ్యారెంటీ పే చర్చ...

ఎన్నికల్లో గెలిపిస్తే ప్రతి ఇంటికి కోటి రూపాయలు. ఒక్కసారి కాదు ప్రతి ఏటా కోటి రూపాయలు. ప్రతి ఇంటికి ఓ హెలికాప్టర్. కొత్త జంటకు బంగారు నగలు, మూడంతస్తుల బిల్డింగ్. ఆడవాళ్లకు వంటింటి పనిభారం తగ్గించేందుకు రోబోలు, కాల్వల్లో ఈదడానికి ప్రతి కుటుంబానికి ఓ పడవ. తమిళనాడు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన ఓ జర్నలిస్ట్ ఇచ్చిన హామీలు ఇవి. ఆపరేషన్ దుర్యోధన సినిమాలో.. హైదరాబాద్‌కు సముద్రాన్ని తెస్తానని హీరో ప్రామిస్ చేస్తే అంతా నవ్వుకున్నాం గానీ.. తమిళనాడులో నిజంగానే హామీలిచ్చాడు. ఇందులో.. ఎదుటివాళ్లు హామీలు ఇస్తున్నారు కదా అని ఓటు వేయొద్దని చెప్పడం ఒక ఉద్దేశం అయితే.. పార్టీల హామీలపై సెటైర్లు వేయడం మరో ఉద్దేశం. కలర్ టీవీలు, ఫ్యాన్లు, మిక్సీలు, ల్యాప్‌టాప్‌లు.. ఇలా ఎన్ని హామీలు ఇచ్చారో తమిళనాడులో. ఆ రాష్ట్రం సంగతేమో గానీ.. దేశవ్యాప్తంగా ఎన్నికల హామీలపై ఓ చర్చ అయితే జరుగుతోందిప్పుడు. కాంగ్రెస్ హామీలపై మోదీ చేసిన కామెంట్.. 'కాస్త చూసుకుని హామీలు ఇవ్వండంటూ' ఖర్గే చెప్పడం చూశాక.. 'గ్యారెంటీ పే చర్చ' నడుస్తోంది. గెలవడానికి హామీలు ఇవ్వడం, గెలిచాక చతికిలపడడం, ప్రజల్లో నమ్మకం కోల్పోవడం.. కొన్ని పార్టీలకు ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది అసలు విషయం. ఇంతకీ.. మోదీ ఎందుకని పర్టిక్యులర్‌గా తెలంగాణ, కర్నాటకను ఎగ్జాంపుల్‌గా చూపించారు? ఖర్గే ఎందుకని జాగ్రత్తపడ్డారు? బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మరోసారి ఆలోచించుకుంటామని కర్నాటక ప్రభుత్వం ఎందుకంది? ఉచితాలపై ఇస్తున్న హామీల విషయంలో కాంగ్రెస్ మారాలి అంటున్నారాయన. సూపర్-5, సూపర్-6, సూపర్-10.. ఇలాంటి హామీలపై పునరాలోచించుకుందాం అన్నారు. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సహా మేధావులు, ఆర్థిక నిపుణులు మొత్తుకుంటున్నది, హెచ్చరిస్తున్నది దీని గురించే.

ఇంతకీ మల్లికార్జున ఖర్గే ఏమన్నారు? ఒక హామీ ఇచ్చే ముందు.. 'అది సాధ్యమా కాదా, ఖజానాలో డబ్బులు ఉన్నాయా లేవా, ఐదేళ్ల పాటు నడిపించగలమా లేదా' అనేది చూసుకోమంటున్నారు. మరో మాటలో చెప్పాలంటే అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేయాల్సినంత అవసరం రాకూడదు అంటున్నారు. గల్లా పెట్టెలో డబ్బుల్లేకపోయినా పథకాలు అమలుచేస్తే.. అది భవిష్యత్ తరాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఈ స్టేట్‌మెంట్‌లో ప్రతి అక్షరమూ నిజమే. మరో మాట కూడా అన్నారు మల్లికార్జున ఖర్గే. కనీసం రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ఇక పథకాలు అమలు చేసి ఏం లాభం అని. పథకాలు ఇచ్చుకుంటూ పోయి అభివృద్ధి చేయలేకపోతే ప్రజలు తిరగబడతారన్నారు. అదే జరిగితే.. భవిష్యత్ తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదంటూ హెచ్చరికలు చేశారు.కొందరు కామెంట్ చేయొచ్చు. 'ఏం.. హామీలు ఇచ్చే ముందు తెలియలేదా ఆ విషయం' అని. ఇప్పటికైనా ఆ మేల్కొలుపు మాటలు అంటున్నందుకు సంతోషించాలి గానీ కామెంట్ చేయనక్కర్లేదు. అంతా బాగానే ఉంది గానీ.. ఈ జ్ఞానోదయం వెనక కారణం ఏంటి? ఓవైపు మహారాష్ట్ర ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న వేళ.. పథకాల విషయంలో ఈ వెనకడుగు ఏంటి? ఎందుకంటే.. కర్నాటకలో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణం పథకాన్ని ఆపేయడమో లేదా పరిమితులు విధించడమో చేయబోతున్నారని ఓ ప్రచారం నడుస్తోంది. అది నిజమే అన్నట్టుగా.. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా స్టేట్‌మెంట్ ఇచ్చారు. 'ఎస్.. ఉచిత బస్సుపై పునరాలోచనలో ఉన్నాం' అంటూ మాట్లాడారు. ఈ పథకాన్ని పూర్తిగా తీసేయకపోవచ్చు గానీ.. ప్రభుత్వంపై భారం తగ్గించుకునే ప్రయత్నం అయితే చేయొచ్చని చెబుతున్నారు. దీనిపై మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. 'ముందుగా హామీ ఇవ్వడం ఎందుకు, ఇప్పుడు వెనక్కి తగ్గడం ఎందుకు' అని ఖర్గే కామెంట్ చేసినట్టుగా చెబుతున్నారు.కాంగ్రెస్ చీఫ్ నుంచి ఈ మాట వచ్చిందో లేదో.. వెంటనే ఖర్గే వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు ప్రధాని మోదీ. 'అమలుచేయలేని హామీలు ఇవ్వడం సులభమే.. వాటిని అమలు చేయడం ఎంత కష్టమో ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ గుర్తిస్తోంది' అంటూ ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. అక్కడితో ఆగలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో, అభివృద్ధి ఎలా కుంటుపడిందో చూడాలంటూ కామెంట్ చేశారు. వెంటనే.. మాజీ మంత్రి కేటీఆర్ కూడా అందుకున్నారు. గాలిమాటల గ్యారెంటీలతో మొదటికే మోసం వస్తుందన్న విషయం కాంగ్రెస్‌కు ఇప్పుడు అర్థమయిందా అంటూ విమర్శించారు. గ్యారెంటీల పేరుతో చేసిన మోసం క్షమించలేనిదంటూ ఫైర్ అయ్యారు. కర్నాటకలో ఐదు గ్యారెంటీలు ప్రకటించినప్పుడు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో వల వేసినప్పుడు బడ్జెట్ గురించి తెలియదా అంటూ నిలదీశారు కేటీఆర్. అఫ్‌కోర్స్ ఈ కామెంట్లకు కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చిందనుకోండి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రధాని మోదీని ప్రశ్నించారు ఖర్గే. ప్రధాని మోదీ తెలంగాణ టాపిక్ తీసుకురావడంతో.. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా రియాక్ట్ అయ్యారు. ఉచిత బస్సు ప్రయాణంతో తెలంగాణ మహిళలకు 3,433 కోట్ల రూపాయలు ఆదా అయిందన్నారు. 18వేల కోట్ల రూపాయలతో దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయల వరకు వైద్య సదుపాయం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 50వేలకు పైగా ఉద్యోగ నియామకాలు, హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలు 40 శాతం పెంపు.. ఇలా ఏ బీజేపీ పాలిత రాష్ట్రాన్ని తీసుకున్నా.. తెలంగాణదే రికార్డ్ అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్.. ఇలా సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ దూసుకుపోతున్నామని బదులు ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి.13 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందంటూ ఓ వైపు టీడీపీ విమర్శించినా సరే..గత జగన్ ప్రభుత్వం మాత్రం పథకాలు పంచుతూనే వెళ్లింది. ఐదేళ్లలో 2 లక్షల 74 వేల కోట్ల రూపాయలు అక్కచెల్లెమ్మలకు నేరుగా పంచామని చెప్పుకున్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్.

కాని, అన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా.. పోయిన ఎన్నికల్లో ఓట్లు వేయలేదు ఏపీ ప్రజలు. తెలంగాణలోనూ అదే జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోనే ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలయ్యాయి. కాని, పట్టణాల్లో ఎక్కువ సీట్లు వచ్చాయి. సంక్షేమంతోనే ఎన్నికల్లో గెలుస్తాం అని ఏ పార్టీ అయినా అనుకుంటే అది పొరపాటు అవుతుందనడానికి తెలుగు రాష్ట్రాలే బెస్ట్ ఎగ్జాంపుల్. , రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాల్సింది ఏంటంటే.. సంపద సృష్టి జరగొచ్చు గాక. కాని అది వెంటనే జరిగిపోదుగా. రెండేళ్లో, ఐదేళ్లో పట్టొచ్చు. ఆ తరువాత ఆ సంపద నుంచి ఆదాయం పెరగొచ్చు. కాని, అంతకంటే ముందు జరగాల్సింది పథకాల అమలు. వచ్చీ రాగానే పథకాలు కావాలి, ఇవ్వాలి అనే అడుగుతారు జనం. సో, సంపద సృష్టించి, పథకాలు అమలు చేస్తాం అనే మాట కరెక్టే గానీ.. ఆ రెండింటికీ టైమ్ గ్యాప్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఈలోపు పథకాలు అమలు చేయాల్సిందే. సో, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతుంటుంది. ఓవైపు ఖజానాలో డబ్బు ఉండదు. కాని, ప్రజలకు వెంటనే పంచేయాలి. అంటే ఏం చేయాలి..? అభివృద్ధి పనులు ఆపేయాలి. లేదా ప్రజలపై భారం మోపాలి. అలా చేస్తే అల్టిమేట్‌గా నష్టపోయేది ప్రజలే. ప్రజలపై భారాలు మోపితేనే సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లే పరిస్థితి వస్తుంది. అలా చేశారనే కదా.. 'బాదుడే బాదుడు' నినాదాన్ని తీసుకొచ్చింది టీడీపీ. ప్రజల్లో కూడా 'ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కుంటున్నారు' అనే అభిప్రాయం ఏర్పడింది. ఒకవేళ ప్రజలపై భారం మోపకూడదు అనుకుంటే..

ఎడాపెడా అప్పులు చేయాలి. అలాంటప్పుడు గత ప్రభుత్వం చేస్తున్న తప్పే ఈ ప్రభుత్వం చేస్తున్నట్టు కదా. లేదా.. అభివృద్ధి విషయంలో కాంప్రమైజ్ అవ్వాలి. ఏపీలో అదే జరిగిందంటారు రాజకీయ విశ్లేషకులు. సంక్షేమ పథకాలపైనే ఫుల్ ఫోకస్ పెట్టే సరికి గత జగన్ సర్కార్ అభివృద్ధిని మ్యాచ్ చేయలేకపోయింది అనే విమర్శ ఎదుర్కొంది. సో, ఇలాంటి తలనొప్పులు రాకూడదని ముందు జాగ్రత్తగా ఓ మంచి సూచన చేశారు మల్లికార్జున ఖర్గే. హామీలు ఇచ్చే ముందు రాష్ట్ర బడ్జెట్ అనుమతిస్తుందా లేదా అనేది చూసుకోవాలన్నారు. ఎందుకంటే.. డబ్బులేం ఊరికే రావు. అవేం ఆకాశం నుంచో ఊడిపడవు, చెట్లకు కాయవు. సో, ఉన్నంతలో ప్రజలకు ఎలా మేలు చేయగలమో ఆలోచించాలన్నారు మల్లికార్జున ఖర్గే. ఇప్పటికైనా.. ఖర్గే సూచనను ఓ అలారమ్‌గా తీసుకుని మేల్కొంటే మంచిదంటున్నారు మేధావులు

# తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య -నేడు ఆయన వర్ధంతి



మహాకవి దాశరథి కృష్ణమాచార్య దాశరథిగా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించి ఇప్పటి ఉద్యమానికీ ప్రేరణనందిస్తున్న కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22న వరంగల్ జిల్లా గూడూరు గ్రామంలో జన్మించాడు. ప్రస్తుతం ఈ గ్రామం ఖమ్మం జిల్లాలో ఉంది. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బిఏ చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. రైతుదే తెలంగాణము రైతుదే.ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్ అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. నిరంకుశ నిజాము పాలన గురించి.. ఓ నిజాము పిశాచమా, కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటి రతనాల వీణ ఎముకల్ మసిచేసి పొలాలు దున్ని భోషాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే తెలంగాణము రైతుదే. ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదులోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది నిజాము ప్రభుత్వం. ఆయనతోపాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నాడు. మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. 1987 నవంబరు 5 న దాశరథి మరణించాడు. చిత్ర పరిశ్రమకు దాశరథి ఆగమనం'ఇద్దరు మిత్రులు' చిత్రం ద్వారా సుప్రసిద్ధ గేయ రచయిత చిత్రపరిశ్రమకు పరిచయం అయ్యారు. ఆయనే దాశరథి. ఈ పరిచయానికి పూర్వం దాశరథి తాను తెలుగులోకి అనువదించిన గాలిబ్ గేయాలను అక్కినేని నాగేశ్వరరావుకు అంకితం చేశారు. ఆ సభకు బూర్గుల రామకృష్ణారావుగారు అధ్యక్షత వహించారు. ఆ గేయ సంపుటిని మధుసూదనరావు చదివారు. ఆ శైలి ఆయనకు బాగా నచ్చింది. మీరు సినిమాలకు పాటలు వ్రాయకూడదా? అన్నారు మధుసూదనరావు. అందుకు సమాధానంగా "నాకు సంగీత పరిజ్ఞానం లేదు కదా ఎలా?" అన్నారు దాశరథి. "అదంతా మేం చూసుకుంటాం. మీరు వ్రాస్తారా ?" అన్నారు మధుసూదనరావు. ఒ.కె. అన్నారు దాశరథి. ఆ మర్నాడు మద్రాసు ప్రయాణమయ్యారు. తొలిసారిగా సంగీత దర్శకుడు ఎస్.రాజేశ్వరరావుతో మ్యూజిక్ సిట్టింగ్‌లో పాల్గొన్నారు దాశరథి. ట్యూన్‌కు రాస్తారా ? లేక మీరు రాస్తే నేను ట్యూన్ కట్టుకోవాలా? అనడిగారు రాజేశ్వరరావు. ట్యూన్‌కు రాయటమంటే ఏమిటి? ఆశ్చర్యంగా అడిగారు దాశరథి. అంటే 'నేను 'సరిగమలు' వ్రాసి ఇస్తే దాని ప్రకారం మీరు పదాలు వేయటం ఒక పద్ధతి. మీరు వ్రాస్తే దానికి నేను ట్యూన్ కట్టుకోవటం రెండవ పద్ధతి. ఈ రెంటిలో ఏది మీకు ఈజీ చెప్పండి' - అన్నారు రాజేశ్వరరావు. సరే మీరే ట్యూన్ ఇవ్వండి. రాస్తాను. ఛాయిస్ రాజేశ్వరరావు గారికే ఇచ్చారు దాశరథి. ట్యూన్ ఇచ్చి అలా తమలపాకు బిగిద్దామని వెళ్లారు రాజేశ్వరరావు. పది నిముషాల్లో తిరిగి వచ్చేసరికి 'రెడీ' అన్నారు దాశరథి. అప్పుడేనా? అని ఆశ్చర్యపోతూనే హార్మోనియంలో రాగాలాపన చేసి సరిచూసుకున్నారు రాజేశ్వరరావు. ఆయన ఆశ్చర్యానికి అంతులేదు. వెంటనే చరణాలకు ట్యూన్ ఇచ్చి ఇలా పక్కకు వెళ్లి మధుసూదనరావు చెవులో గుసగుసగా చెప్పారు. "అమ్మో ! ఈయన అఖండుడండీ. నేను ఇచ్చింది చాలా కష్టమైన ట్యూన్. పది నిముషాల్లో రాసి పడేసారంటే నమ్మండి" అంటూ తెగ మెచ్చుకున్నారు రాజేశ్వరరావు. ఈవిధంగా దాశరథి కలం నుండి జాలువారిన తొలి సినిమా పాట 'ఖుషీఖుషీగా నవ్వుతూ చెలాకి మాటలు రువ్వుతూ', 'పాడవేల రాధికా' అంటూ సాగింది. "ఖుషీ ఖుషీగా నవ్వుతూ" పాట ట్యూన్ ఒక ఇంగ్లీషు ఆల్బమ్ నుండి తీసుకున్నారు రాజేశ్వరరావు గారు. హైదరాబాద్‌లో ఉంటూ ఇక్కడి 'ఖవ్వాలి' పాటల తీరుతెన్నులు తెలిసిన వారు కావటంతో చిత్రంలోని ఒక ఖవ్వాలి పాటను కూడా ఆయనతో వ్రాయించారు. "నవ్వాలి నవ్వాలి నీ నవ్వులు నాకే ఇవ్వాలి" అన్న ఈ పాట "ఇద్దరు మిత్రులు" చిత్రంలోని తొలి పాట. అలా ఆయన వెండితెరపై గీతాలను శ్రోతలకు రుచి చూపించారు.

# తెలుగు రాష్ట్రాలకు పెరిగిన జీఎస్టీ ఆదాయం




న్యూఢిల్లీ, నవంబర్ 4 (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్‌లో రూ.3,815 కోట్లు, తెలంగాణలో రూ.5,211 కోట్లు జీఎస్టీ వసూలు అయినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.2024 అక్టోబర్ వరకు ఎస్‌జీఎస్‌టీ నిధులు ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,171 కోట్లు ఇచ్చినట్లు, తెలంగాణకు రూ.25,306 కోట్లు ఇచ్చినట్లు తెలిపింది.అక్టోబర్– 2024 కు సంబంధించిన జీఎస్టీ వసూలు దేశవ్యాప్తంగా రూ.1,42,251 కోట్లు వసూలు అయ్యాయని, గతేడాది అక్టోబర్‌లో రూ.1,28,582 కోట్లు వసూలు అయ్యాయని కేంద్రం తెలిపింది. ఈ ఏడాది ఏకంగా 10.63 శాతం వసూళ్లు పెరిగాయని వెల్లడించింది.ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది అక్టోబర్ రూ.3,493 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.3,815 కోట్లు పెరిగిందని, పెరుగుదల 12 శాతం నమోదు అయిందని కేంద్రం తెలిపింది. తెలంగాణలో గతేడాది అక్టోబర్‌లో రూ.4,868 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.5,211 కోట్లు వసూలు అయిందని, పెరుగుదల 7 శాతం నమోదు అయిందని పేర్కొంది.ఈ ఏడాదిలో అక్టోబర్ వరకు ఎస్‌జీఎస్‌టీ నిధులు ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,171 కోట్లు ఇచ్చినట్లు, తెలంగాణకు రూ.25,306 కోట్లు ఇచ్చినట్లు పేర్కొంది. ఏపీకి గతేడాది అక్టోబర్ వరకు రూ.18,488 కోట్లు ఎస్‌జీఎస్‌టీ నిధులు ఇవ్వగా, ఈ ఏడాది నాలుగు శాతం నిధులు పెరిగాయి. తెలంగాణలకు గతేడాది అక్టోబర్ వరకు రూ.23,478 కోట్లు ఇవ్వగా, ఈ ఏడాది ఎనిమిది శాతం నిధులు పెరిగాయి.దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ ఏడాది అక్టోబర్ వరకు రూ.5,555,227 కోట్లు సీజీఎస్‌టీ నిధులను విడుదల చేసింది. గత ఏడాది అక్టోబర్ వరకు రూ.4,97,562 కోట్లను విడుదల చేసింది. అంటే గతేడాది కంటే, ఈ ఏడాది 12 శాతం సీజీఎస్‌టీ నిధులను విడుదల చేసింది.ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు సెంట్రల్ పూల్ కింద 1,76,254 జీఎస్‌టీ ఖాతాల నుంచి సీజీఎస్‌టీ రూ. 3,478 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ. 4,449 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.5,421 కోట్లు, సెస్ రూ.1,631 కోట్లు, మొత్తం రూ.14,980 కోట్లు వసూలు అయింది. స్టేట్ పూల్ కింద 2,44,326 జీఎస్‌టీ ఖాతాల నుంచి సీజీఎస్‌టీ రూ. 3,122 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ. 3,967 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.4,165 కోట్లు, సెస్ రూ.124 కోట్లు, మొత్తం రూ.11,377 కోట్లు వసూలు అయింది.మొత్తం సెంట్రల్, స్టేట్ పూల్ కింద సీజీఎస్‌టీ రూ. 6,600 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ. 8,416 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.9,586 కోట్లు, సెస్ రూ.1,755 కోట్లు, మొత్తం రూ.26,357 కోట్లు వసూలు అయింది. ఏపీలో సెంట్రల్ పూల్ కింద 3.5 శాతం, స్టేట్ పూల్ కింద 4.9 శాతం, మొత్తంగా 4.1 శాతంగా జీఎస్‌టీ వసూళ్లు పెరిగాయి.తెలంగాణలో 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు సెంట్రల్ పూల్ కింద 2,23,832 జీఎస్‌టీ ఖాతాల నుంచి సీజీఎస్‌టీ రూ. 4,571 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ. 5,599 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.4,896 కోట్లు, సెస్ రూ.2,662 కోట్లు, మొత్తం రూ.17,729 కోట్లు వసూలు అయింది. స్టేట్ పూల్ కింద 3,09,097 జీఎస్‌టీ ఖాతాల నుంచి సీజీఎస్‌టీ రూ. 5,051 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ. 6,490 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.5,743 కోట్లు, సెస్ రూ.952 కోట్లు, మొత్తం రూ.18,195 కోట్లు వసూలు అయింది.మొత్తం సెంట్రల్, స్టేట్ పూల్ కింద సీజీఎస్‌టీ రూ. 9,581 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ.12,089 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.10,639 కోట్లు, సెస్ రూ.3,615 కోట్లు, మొత్తం రూ.35,924 కోట్లు వసూలు అయింది. ఏపీలో సెంట్రల్ పూల్ కింద 7.3 శాతం, స్టేట్ పూల్ కింద 3.2 శాతం, మొత్తంగా 5.2 శాతంగా జీఎస్‌టీ వసూళ్లు పెరిగాయి

# నర్సిపురంలో ఏనుగుల భీబత్సవం



పార్వతీపురంలో ఏనుగుల గుంపు హల్ చల్ చేస్తూ. కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పార్వతీపురం మండలం, నర్సిపురం సమీపంలో కొబ్బరి తోటను ఏనుగుల గుంపు పూర్తిగా ధ్వంసం చేసింది. దాదాపు రెండు వందల కొబ్బరి చెట్లను పూర్తిగా లాగి విసిరేసాయి. ఏనుగుల సంచారంతో సమీపంలో ఉన్న పంట పొలాలు ధ్వంసమయ్యాయి. దీంతో రైతులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని, ఎలాగైనా నష్టపరిహారం అందించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు నుంచి తమను రక్షించాలని వారు కోరుతున్నారు

# యోగి ఆదిత్యనాథ్ కు రాజీనామా చేయాలని వార్నింగ్



లక్నో, నవంబర్ 4, (న్యూస్ పల్స్) దేశంలో ఇటీవల బెదిరింపు ఫోన్‌కాల్స్, మెయిల్స్ పెరుగుతున్నాయి. ఇప్పటికే పదులు సంఖ్యలో విమానాలకు బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఇక మహారాష్ట్రలో ఎన్సీపీ నాయకుడు మాజీ మంత్రి, ఎన్సీపీ(అజిత్ పవార్) నాయకుడు బాబా సిద్దిక్ బాంద్రాలో కాల్చి చంపబడ్డారు. నటుడు సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు వచ్చాయి. తాజాగా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రికి ముప్పు కూడా వచ్చింది. ముంబై ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్ రూమ్ యొక్క వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్‌కు శనివారం(నవంబర్ 2న) సాయంత్రం గుర్తు తెలియని నంబర్ నుంచి మెస్సేజ్ వచ్చింది. యోగి ఆదిత్యనాథ్ పది రోజుల్లో రాజీనామా చేయకపోతే 'బాబా సిద్దిక్ లాగా హతమారుస్తామని అందులో ఉంది. ఉలిక్కిపడిన ముంబై పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. మెస్సేజ్ పంపిన వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.ముంబై పోలీసులకు కొన్ని వారాలుగా బెదిరింపు ఫోన్స్, మెస్సేజ్‌లు వస్తున్నాయి. మొన్నటి వరకు విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి. తాజాగా యూపీ సీఎంను చంపుతామన్న మెస్సేజ్ వచ్చింది. అంతకు ముందు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ తమకు డబ్బులు చెల్లించకపోతే చంపుతామని మెస్సేజ్ పంపారు. ఈ సంవత్సరం ప్రారంభంలో నటుడి ఇంటి ఆవరణలో కాల్పులు కూడా జరిగాయి. ఈ క్రమంలో పోలీసులు బెదిరింపు మెస్సేజ్ పంపిన వ్యక్తిని ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు జంషెడ్‌పూర్‌లో కూరగాయల అమ్మకందారుడు, నోయిడాకు చెందిన పచ్చబొట్టు కళాకారుడుగా గుర్తించారు.

తర్వాత ఒక మెస్సేజ్ జీషాన్ జిద్దిక్, తర్వాత బాబా సిద్దిక్ కుమారుడు బాంద్రా ఎమ్మెల్యేకు కూడా బెదిరింపు మెస్సేజ్ వచ్చింది. అక్టోబర్ 12న మాజీ మంత్రి కొడుక కార్యాలయానికి సమీపంలో కాల్చి చంపారు. దీని వెనుక జైల్లో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా హస్తం ఉందని గుర్తించారు.

న్సీపీ నేత సిద్ధికి హత్యకు ప్రధాన కారణం అతను సల్మాన్‌ఖాన్‌కు దగ్గరగా ఉండడమే కారణమని బిష్ణోయ్ ముఠా నుంచి మెస్సేజ్ వచ్చింది. తర్వాత సల్మాన్‌ఖాన్‌కు కూడా బెదిరింపు మెస్సేజ్‌లు వచ్చాయి. హమ్ సాత్ సత్ హైన్ కాల్పులు జరిపిన సందర్భంగా రాజస్థాన్‌లో జరిగిన బ్లాక్‌బక్ వేట కేసులో ఆయన పాల్గొనడంతో లారెన్స్ బిష్ణోయి ముఠా కూడా ఏప్రిల్‌లో సల్మాన్ ఖాన్ ఇంటి వెలుపల కాల్పుల వెనుక ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# సీఎం రేవంత్ రెడ్డి పై ఎంపి డికె అరుణ ఫైర్



హైదరాబాద్ సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ పై ఎంపి డికె అరుణ మండిపడ్డారు. సోనియా గాంధీ పుట్టిన రోజే అన్ని హామీలు అమలు చేస్తాం అన్నారు. ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదు. ఒక్క ఇల్లు మొదలు పెట్టలేదు. కేంద్రం నిధులు లేకుండా వీళ్ళు ఇళ్లు కడతారా..? రైతు రుణమాఫీ సగం మందికి కాలేదు. సిగ్గులేకుండా రేవంత్ అబద్ధాలు చెప్తున్నారు. పక్క రాష్ట్రం కర్నాటకలో డికె శివకుమార్ ఫ్రీ బస్ ఎత్తేస్తాం అంటున్నారు. గ్రామాలకు బస్సులు బంద్ చేసి ఫ్రీ బస్ అంటున్నారు . అన్ని అమలు చేస్తున్నాం అనడానికి సీఎం రేవంత్ కు సిగ్గు ఉండాలి. ప్రధాని మోడీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల వైఫల్యాలు ఎత్తి చూపారని అన్నారు. 500 రూపాయలకే సిలిండర్ లో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ 375 , మరి మీరిచ్చేది ఎంత..? ఉజ్వల గ్యాస్ కనెక్షన్ లు అన్ని కేంద్రానివే కదా. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను భ్రమలో ఉంచుతున్నారు. కానీ ప్రజలు మేల్కొన్నారు . అన్ని అర్థం చేసుకుంటారు. రైతు భరోసా లేదు, కౌలు రైతులకు , కూలీలకు సాయం దిక్కు లేదు . కాలేజీ చదివే అమ్మాయిలకు స్కూటీ లు ఎటు పాయే. 11 నెలలో 50 వేల ఉద్యోగాల భర్తీ మాట పెద్ద బోగస్. 10 లక్షల రూపాయల వైద్యం ఈ పది నెలల్లో ఎంతమందికి, ఎక్కడెక్కడ చేయించారో బయట పెట్టండి. చెప్పిన మాట నిలబెట్టు కోకుండా దబాయించాలని చూస్తున్నారు. కొత్తగా ఒక ఫించను దరఖాస్తు కూడా తీసుకోలేదు. కొత్త వితంతు ఫించన్లు రాక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు

# ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్ - నలుగురి మృతి






ఉండ్రాజవరం ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్ తో నలుగురు మృతి. వివాదాస్పదమైన విగ్రహావిష్కరణ, విగ్రహావిష్కరణ రోజునే విషాదం మిగిల్చింది. విద్యుత్ షాక్ నలుగురిని విగత జీవులుగా మార్చింది. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో సోమవారం తెల్లవారుజాము చోటుచేసుకున్న విషాద సంఘటన వివరాలు. గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ఆది నుండి వివాదాల మయమైంది. ఇరు వర్గాల మధ్య ఘర్షణను లేవ దీసింది. చివరికి జిల్లా కలెక్టర్, ఆర్డిఓ వంటి ఉన్నతాధికారుల చొరవతో సమస్య తీరింది. ఎట్టకేలకు సోమవారం విగ్రహావిష్కరణ, అన్న సమారాధన కు ఏర్పాటు చేసుకున్నారు నిర్వాహకులు. ఈ ఏర్పాట్లే నలుగురి ప్రాణాలను బలిగొంది. భారీ ఏర్పాట్ల నేపథ్యంలో ఫ్లెక్సీలు కడుతున్న నలుగురు యువకులకు కరెంట్ షాక్ తగిలి, బొల్లా వీర్రాజు (25), కాశగాని కృష్ణ (23), పామర్తి నాగేంద్ర (25), మారిశెట్టి మణికంఠ పెద్దయ్య(29) సంఘటన స్థలం లోనే మరణించారు. మరో వ్యక్తి కోమటి అనంత రావు తీవ్రంగా గాయపడ్డాడు. వీరి ఇరువురిని హుటాహుటిన తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం తెల్లవారుజాము మూడు గంటలకు జరిగిన ఈ దుస్సంఘటన తో గ్రామంతో పాటు యావత్ మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

# విమర్శలు మానండి..అభివృద్ధికి సహకరించండి ఎంపి అనిల్ యాదవ్

హైదరాబాద్ .. నరేంద్ర మోడీ తన అధికారిక ట్వీట్ నుంచి తెలంగాణ పైన చేసిన కామెంట్స్ ను డిలీట్ చేస్కోవడం తో తెలంగాణ లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఆయన అంగీకరించినట్టు అయ్యిందని ఎంపి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కాంగ్రెస్ రాష్ట్రాల్లో ఎన్నికలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, కామెంట్స్ చేస్తూ ట్వీట్ చేశారు.. అందుకు బదులు ఇస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 10 నెలల కాలంలో తెలంగాణ లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ రీ ట్వీట్ చేశారు. దీంతో రేవంత్ రెడ్డి ట్వీట్ ను చూసిన మోడీ తెలంగాణ లో జరుగుతున్న కార్యక్రమాలను వెరిఫై చేసుకొని ట్వీట్ ను డిలీట్ చేశారు. ఇప్పటికైనా మోడీ భజన బృందం తెలంగాణ అభివృద్ధిని చూసి విమర్శలు మానుకొని సహకరించాలని అన్నారు.

# రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా

మాస్కో, నవంబర్ 4, (న్యూస్ పల్స్)ప్రపంచంలో ప్రమాదకరమైన దేశాధినేతల్లో ఇద్దరు అయిన రష్యా ప్రెసిడెంట్ పుతిన్, ఉత్తర కొరియా నియంత కిమ్ యుద్ధంలో చేతులు తలిపారు. ఉక్రెయిన్ పై రష్యా చేస్తున్న పోరాటానికి ఉత్తర కొరియా తరపున పదివేల మంది వరకూ సైనికుల్ని పంపాలని నిర్ణయించింది. ఉక్రెయిన్‌తో రెండున్నరేళ్లుగా రష్యా యుద్ధం చేస్తోంది.ఈ యుద్ధంలో రష్యా కొన్ని వేల మంది సైనికుల్ని కోల్పోయినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో సైనికుల కొరత ఏర్పడిందేమో కానీ తానున్నానంటూ మిత్రుడు కిమ్ స్నేహ హస్తం అందించారు.కిమ్ జోంగ్ ఉన్ క్రూరమైన ఉత్తరకొరియా నియంతగా పేరు పొందారు. ఆయనకు చైనా, రష్యాతో తప్ప ఏ దేశంతోనూ సంబంధాలు ఉండవు. ఆ రెండు దేశాల అధినేతలో ఫ్రెండ్ షిప్ కొనసాగిస్తారు. వెళ్తే ఆయన పర్యటనలు ఆ రెండు దేశాలకే ఉంటాయి. ఆ దేశాల అధ్యక్షులే ఉత్తరకొరియాకు వెళ్తారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు గా ఉన్నప్పుడు ఆయనతో చర్చలు జరిపారు కానీ ఏ మాత్రం వర్కవుట్ కాలేదు. ఇద్దరూ విచిత్రంగా తిట్టుకునేవారు. ఆ ఎపిసోడ్ అలాగే ఉండగానే రష్యా కోసం ఉత్తర కొరియా సైనికుల్ని పంపాలని నిర్ణయించుకున్నారు. ఓ వైపు దక్షిణ కొరియా తమ దేశంపై యుద్ధం చేస్తుందేమోనని.. తమ నాయకుడిపై హత్యాయత్నం చేస్తున్నారే?మోనని ఉత్తర కొరియా సైన్యం అనుమానిస్తోంది. అందుకే తమ దేశ సరిహద్దుల్ని రోడ్డు, రైలు మార్గాల్ని తవ్వేశారు. దక్షిణ కొరి?యా తమ దేశంపై దండెత్తాలని చూస్తే అణుబాంబులు వేస్తామని హెచ్చరికలు చేస్తూ ఉంటారు. మరో వైపు పుతిన్ కూడా అదే చెబుతున్నారు. ఉక్రెయిన్ కు అతి పెద్ద ఆయుధాలు ఇవ్వాలని ఇటీవల నాటో కూటమి నిర్ణయించింది. ఈ నిర్ణయంపై పుతిన్ ఫైర్ అవుతున్నారు. తమ దేశంపై దాడి చేయడానికి ఆయుధాలిచ్చే దేశాలు కూడా తమకు శత్రువులేనని వాటిపై అణుబాంబులు వేయడం తమ విధానంలో భాగమేనని కూడా ప్రకటించుకున్నారు. అలా చేయడమే కాదు.. అణుబాంబులు వేసేందుకు ప్రాక్టీస్ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తర కొరియా కూడా రష్యాతో చేతులు కలుపుతోంది. ఓ వైపు మధ్య ప్రాచ్యంలో అల్లకల్లోలం కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో అన్ని దేశాలు ఒకే సారిఉద్రిక్త పరిస్థితులు తీసుకు వస్తే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుంది. అణు అస్త్రాలు ఉన్న ఉత్తరకొరియా, రష్యా అధ్యక్షులు తర్వాత ఏం జరుగుతుందా అన్న అంశాలను పట్టించుకోరు. అందుకే ప్రపంచం అంతా ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో ఉంది.

# మాజీ సర్పంచ్ ల అరెస్టులను, ఖండించిన మాజీ మంత్రి హరీష్ రావు



హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మాజీ సర్పంచుల అరెస్టులను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్ లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ముఖ్యమంత్రి ని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్ కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికం. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నది. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారను. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటి? అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచులు వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాంమని అన్నారు

# జనవరిలో పంచాయితీ ఎన్నికలు

హైదరాబాద్, నవంబర్ 4, అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారం మారిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేలిపోయింది. తెలంగాణలో ప్రధాన పార్టీలు ఇప్పుడు మరో అగ్నిపరీక్షకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల జాతరకు.. త్వరలోనే తెరలేవబోతోంది. కొత్త సంవత్సరంలోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. సర్పంచ్ ఎన్నికలకు డిసెంబర్ నెలలోనే ముహూర్తం ఫిక్స్ చేసినట్లు స్పష్టం చేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. 2025 జనవరి నెలలో గ్రామాలకు కొత్త సర్పంచ్‌లు వస్తారంటూ మీడియా చిట్‌చాట్‌లో స్పష్టం చేశారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంకావాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని ఎస్ఈసీ స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రంలోని 12 వేల 751 గ్రామ పంచాయతీల పదవీకాలం ఈ ఏడాది జనవరిలోనే ముగిసింది. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. పంచాయతీ ఎలక్షన్లు నిర్వహించకపోవటంతో రాష్ట్రానికి రావాల్సిన రూ.1,800 కోట్ల నిధులు కేంద్రవద్దే ఉండిపోయాయి. దీంతో సత్వరమే ఎన్నికలను నిర్వహించి, ఆ నిధులను తెచ్చుకోవాలని భావిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ. 2025లో నిర్వహించబోయే అన్ని ఎన్నికలకు ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే రూపొందించింది. మరోవైపు ఈనెల ఆరు నుంచి సమగ్ర కుల గణన ప్రారంభం కానుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను త్వరలోనే ఎంపిక చేస్తామని ప్రకటించారు మంత్రి పొంగులేటి. దీన్నిబట్టి పంచాయతీ నగరాకు అధికార పార్టీ ఇప్పటికే సన్నద్ధమయినట్టు కనిపిస్తోంది.రాష్ట్రంలో బీసీల లెక్క తేలాల్సిందే.. వాళ్లకు దక్కాల్సిన వాటా దక్కాల్సిందే అని ఎన్నికలకు ముందునుంచీ చెబుతూ వస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఆ దిశగానే సమగ్ర కులగణన చేపట్టింది. ప్రభుత్వం చేపట్టిన కులగణన నవంబర్ 30తో ముగియనుంది. ఆ రిపోర్ట్ ఆధారంగా స్థానిక ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేసి స్థానిక ఎన్నికలను నిర్వహించనుంది రేవంత్ రెడ్డి సర్కార్. అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవే కావడంతో వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది కాంగ్రెస్ పార్టీ. ఎన్నికలకు ఇప్పటికే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్న అధికార పార్టీ..భారీ సంఖ్యలో తన మద్దతుదారులను గెలిపించుకునే వ్యూహంలో ఉంది.రుణమాఫీ కార్యక్రమంతో పాటు సంక్షేమ పథకాలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పంచాయతీ ఎన్నికల్లో కలిసొస్తాయన్న ధీమాతో ఉంది అధికారపార్టీ. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటిన బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లోనూ పట్టు నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్‌లో సత్తాచాటిన కారుపార్టీ.. పంచాయతీ ఎన్నికల్లో విజయంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ తమ బలం తగ్గలేదని నిరూపించుకోవాలనుకుంటోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భారాన్ని ఈ ఎన్నికల్లో దించుకోవాలన్న వ్యూహంతో ఉంది ప్రతిపక్ష బీఆర్ఎస్.అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బలం పుంజుకున్న బీజేపీకి కూడా పంచాయతీ, స్థానిక సంస్థలు సవాలుగా మారబోతున్నాయి. క్షేత్రస్థాయిలోనూ బలం ఉందని నిరూపించుకోవాలంటే స్థానిక సంస్థల్లో కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. ఒకరికిద్దరు కేంద్రమంత్రులున్నా పార్టీ రాష్ట్ర సారథిపై నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలు కావటంతో త్వరగా కొత్త అధ్యక్షుడెవరో తేలిస్తే ఎన్నికలకు సిద్ధంకావచ్చంటోంది ఆ పార్టీ కేడర్. మొత్తానికి 11 నెలల గ్యాప్ తర్వాత మళ్లీ తెలంగాణలో ఎన్నికల హడావుడి మొదలుకాబోతోంది. గల్లీదాకా పార్టీజెండా ఎగిరే ఎన్నికలు కావటంతో మూడు ప్రధానపార్టీలకూ అత్యంత కీలకం కాబోతున్నాయి.

# కేసీఆర్ కు మరో చిక్కు...

## విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు



ఖమ్మం, నవంబర్ 4, తెలంగాణలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అవకతవకలు జరిగినట్టు న్యాయవిచారణ కమిషన్ గుర్తించింది. ఈ మేరకు కమిషన్ నివేధిక సిద్ధం చేయగా ప్రభుత్వం తదుపరి కార్యాచరణకు సిద్ధమౌతున్నట్టు తెలుస్తోంది. దాదాపు ఆరేడు అంశాలలో ఉల్లంఘనలు జరిగినట్టు గుర్తించగా ప్రభుత్వ ఖజానాపై భారం పడిందని నివేదికలో పేర్కొన్నట్టు తెలుస్తోంది. కొనుగోలులో ఏ స్థాయిలో అవకతవకలు జరిగాయి? బాధ్యులు ఎవరు అనే అంశాలను సైతం నివేధికలో పొందుపర్చినట్టు సమాచారం. నివేధికలోని అంశాల ఆధారంగా తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం దృష్టిపెట్టబోతున్నట్టు తెలుస్తోంది.మంత్రి వర్గ సమావేశంలో సైతం దీనిపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయట. అదే విధంగా అసెంబ్లీ సమావేశాలలోనూ ఈ అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గత బీఆర్ఎస్ సర్కార్ ఛత్తీస్ గడ్ తో జరిపిన విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో లోపాలు ఉన్నాయని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది. అధికారంలోకి రాకముందే కాంగ్రెస్ నాయకులు విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని విచారణ జరిపించాలని పలుమార్లు డిమాండ్ చేశారు. ఇక అసెంబ్లీ ఎన్నికల తరవాత తమ ప్రభుత్వమే కొలువుదీరడంతో కమిషన్ వేసి విచారణ ప్రారంభించారు.హైకోర్టు మాజీ జడ్జి ఎల్. నరసింహారెడ్డి నేతృత్వంలో న్యాయ కమిషన్ ను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల విచారణ తుదిదశకు చేరుకున్న తరవాత నరసింహారెడ్డిని మార్చాల్సి వచ్చింది. ఆ తరవాత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లోకూర్ ను న్యాయ విచారణ కమిషన్ ఛైర్మన్‌గా నియమించారు. ఇక విచారణ పూర్తి చేసిన లోకూర్ కమిటీ అక్టోబర్ 29న నివేధికను ఇంధనశాక కార్యదర్శికి అందజేసింది. బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్, మరికొందరి పేర్లను ఈ నివేధికలో పేర్కొన్నట్టు సమాచారం. ఇక ఇప్పుడు నివేధికను బట్టి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# మెట్రో పనులు ప్రారంభం



హైదరాబాద్, నవంబర్ 4 రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు విస్తరణ పనుల్లో కీలక పురోగతి చోటుచేసుకుంది. భాగ్య నగరం నలుమూలలకు మెట్రో సేవల్ని అందించేలా ప్రణాళికలు రూపొందించగా.. తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఇప్పటి వరకు హైదరాబాద్ మహా నగరంలో కొన్ని ప్రాంతాలకే మెట్రో పరిమితమైన వేళ.. నూతన ప్రణాళికతో ఐదు నూతన కారిడార్లకు ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా రెండో దశ పనులకు రూ. 24,269 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు రూపొందించగా.. అందులో 30 శాతం నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వ వాటాగా సమకూర్చాల్సి ఉంటుంది. అంటే.. రూ.7313 కోట్లు. కేంద్రం సైతం ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించనుండగా? కేంద్రం వాటాగా 18 శాతం అంటే రూ. 4,230 కోట్లు ఖర్చు చేయనుంది.ప్రాజెక్టులో మిగతా 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా ప్రభుత్వం డీపీఆర్ రూపొందించింది. నగర శివారు ప్రాంతాల నుంచి రోజు లక్షల మంది నగరంలోకి ప్రవేశిస్తుంటారు. వారికి ప్రస్తుతం మెట్రో అనుకున్న మేర సేవలు అందిచలేకపోతోంది. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని.. నగరం నలుమూలలకు మెట్రో విస్తరణ జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాలతో ప్రణాళికలు రూపొందించింది.ఇప్పటి వరకు మూడు కారిడార్ల పనులు పూర్తవగా.. నాలుగో కారిడార్ గా నాగోల్ టూ శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు మెట్రో పరుగులు తీయనుంది. 35.8 కి.మీ మేరు చేపట్టనున్న నిర్మాణాలు.. ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ జోరు మరింత పెంచే అవకాశాలున్నాయని అంచనాలున్నాయి. ఐదో కారిడార్ లో భాగంగా.. ఐటీ ప్రాంతాలైన రాయదుర్గ్ నుంచి కోకాపేట్ నియోపొలిస్ వరకు 11.6 కి.మీ మెట్రో నిర్మించేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. ఇక.. ఆరో కారిడార్లో ఆరో కారిడార్లో.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయన్ గుట్ట వరకు 7.5 కి.మీ, ఏడో కారిడార్ మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు (13.4 .మీ), ఎనిమిదో కారిడార్ ఎల్‌బీనగర్ టూ హయత్ నగర్ వరకు 7.1 కి.మీ. మేర నూతన కారిడార్ అందుబాటులోకి రానుంది.

హైదరాబాద్ కు సిటీ చుట్టు పక్కల నుంచి భారీగా రోజు వారీ కార్మికులు, ఉద్యోగాలు వస్తుంటారు. వారు నేరుగా గమ్య స్థానాలకు చేరుకునే వెసులుబాటు లేకపోవడంతో.. ఆటోలు, బస్సులో మెట్రో స్టేషన్ వరకు రావడం అక్కడి నుంచి మెట్రోలో ప్రయాణించాల్సి వచ్చేంది. మెట్రో దిగిన తర్వాత.. మళ్లీ ఆటోలు, బస్సుల్లో గమ్య స్థానాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అందుకే.. నగరంలో అవసరమైన అన్ని మార్గాల్లో నూతన మెట్రోను పరుగులు తీయించాలని భావించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఐదు నూతన కారిడార్ల డీపీఆర్ లను సిద్ధం చేసి.. పరిపాలన అనుమతులు ఇచ్చింది.

కేంద్రానికి ముడిపెట్టిన రేవంత్

హైదరాబాద్ ప్రజలు ఎప్పుడెప్పుడా అని చూస్తున్న మెట్రో రెండో దశ పనులకు ముహూర్తం వచ్చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెండో దశ పనులకు రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ఇప్పుడు రెండో దశలో భాగంగా 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం చేపట్టనుంది. ఇందుకోసం ప్రభుత్వం జీవో 196ని జారీ చేసింది. రెండో విడత మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం రూ.24,269 కోట్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.7,313 కోట్లను వెచ్చిస్తోంది. ఇప్పటికే నగరంలో కొత్తగా 5 మార్గాల్లో మెట్రో రెండో దశ పనులు చేపట్టనున్నారు.కారిడార్ 4లో నాగోలు-శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కిలోమీటర్లు, కారిడార్ 5లో రాయదుర్గ-కోకాపేట వరకు 11.6 కిలోమీటర్లు, కారిడార్ 6లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రయాణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు, కారిడార్ 7లో మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు 13.4కిలోమీటర్లు, కారిడార్ 8లో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్లు నిర్మించనున్నారు. మొత్తంగా రెండో దశలో 116.4 కిలోమీటర్లు ఈ రైలు మార్గాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించారు. మొదటగా పార్ట్ ఏ కింద 76.4 కిలోమీటర్ల మార్గానికి పరిపాలన అనుమతులు మంజూరైనట్లు, పార్ట్ బిలో నిర్మించనున్న శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మార్గానికి సర్వే జరుగుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇక హైదరాబాద్‌లో మెట్రో ఏర్పాటైనప్పటి నుంచి రోజుకు 5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రెండో దశ కూడా అందుబాటులోకి వస్తే మరో 8 లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.మెట్రో మొదటి దశ పూర్తయి చాలా కాలం కాగా.. ఇప్పటివరకూ రెండో దశ అడుగు ముందుకు పడలేదు. హైదరాబాద్ నగరంలో చాలా పరిమిత ప్రాంతాల వరకే మెట్రో విస్తరించి ఉంది. దీంతో ట్రాఫిక్ కొంత వరకు మాత్రమే తగ్గింది. ప్రజావసరాలను తీర్చేందుకు పూర్తిస్థాయిలో ఉపయోగపడలేదు. అందుకే.. రేవంత్ సర్కార్ రెండో విడతకు శ్రీకారం చుట్టింది. దీంతో శివారు ప్రాంతాలకూ మెట్రో విస్తరించనుంది. దీంతో మహానగరానికి మరింత గుర్తింపు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే.. రెండో విడత కోసం తెలంగాణ ప్రభుత్వం 30 శాతం నిధులు సమకూరుస్తోంది. 18 శాతం నిధులను కేంద్రం ఇస్తోంది. మిగిలిన నిధులను రుణాలు, పీపీపీ పద్ధతిలో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రెండో దశ మీద ఎంతో కాలంగా ఆశలు పెట్టుకున్నప్పటికీ పరిపాలన అనుమతులు రాలేదు. కానీ.. తాజాగా ప్రభుత్వం అన్ని అనుమతులు జారీ చేసింది. ఎలాగూ కేంద్రం కూడా సహకరిస్తుండడంతో రెండో దశ పనులు వెంటనే ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి కేంద్రంతోనూ సఖ్యతగానే ఉంటుండడంతో.. కేంద్రం కూడా సహకరించేందుకు ముందుకు వస్తున్నది. మొత్తంగా రెండో దశ మెట్రో కూడా పనులు పూర్తయితే ఇటు ప్రయాణికులకు మరింత ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. అటు విశ్వనగరం ఖ్యాతి కూడా మరింత పెరగనుంది

## తాడిపత్రు ఘటన మృతుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్ గ్రేషియ

విజయవాడ తాటిపత్రు ఘటనపై మంత్రి కందుల దుర్గేష్‌గ్భ్రాంతి చేసారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఉండ్రాజవరం మండలం తాడిపత్రు గ్రామంలో సర్దార్ పాపన్న విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ షాక్ కు గురై మృతి చెందిన మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు.జ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు అధైర్య పడవద్దని, ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ధైర్యం చెప్పారు.

## బీసీ కులగణన,,, కాంగ్రెస్ వ్యూహం ఏమిటీ




హైదరాబాద్, నవంబర్ 4 తెలంగాణలో. బీసీ కులగణన వెనక వ్యూహం అదేనా.. ఈ కార్యక్రమం కాంగ్రెస్ కు మైలేజ్ తీసుకురాబోతోందా.. బీసీ నేతలకు సీఎం రేవంత్ ఇచ్చిన ఆదేశాలు ఏంటి.. కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఫలిస్తుందా లేదా.. అంటే ఔననే సమాధానమే వస్తోంది. తెలంగాణలో హస్తం పార్టీ బీసీ జపం చేస్తుంది. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని? ఇప్పటినుంచే టార్గెట్ ఫిక్స్ చేసుకొని పనిచేస్తోంది. తెలంగాణలో 50శాతానికి పైగా బీసీ జనాభా ఉంది. మెజారిటీ వర్గమైన బీసీలను పూర్తిస్థాయిలో తమవైపు తిప్పుకోవాలని? హస్తం పార్టీ వ్యూహ, ప్రతివ్యూహాలకు పదును పెడుతోంది. బీసీ కులగణన పేరుతో? భారీ ఆపరేషన్ స్టార్ట్ చేసింది.. కాంగ్రెస్‌కు బీసీల్లో బలం తక్కువ అనే చర్చ మొదటి నుంచి ఉంది. ఉమ్మడి ఏపీలో టీడీపీ వైపు కాస్త మొగ్గుచూపిన బీసీలు.. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్‌కే ఎక్కువ మద్దతుగా ఉన్నారు. గత పదేళ్లలో రకరకాల సంక్షేమ పథకాలతో.. బీసీ ఓటు బ్యాంకును బీఆర్ఎస్ పదిలంగా ఉంచుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ వర్గాన్ని తమ వైపు తిప్పుకునేందుకు.. బీసీ జనగణనను యూజ్ చేసుకోవాలని హస్తం పార్టీ భావిస్తుందనే ప్రచారం జరుగుతోంది.బీసీ జనగణనతో.. రాజకీయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు లబ్ధి చేకూరనుంది. గత ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పదేపదే.. ఇదే అంశాన్ని ప్రస్తావించారు. జనాభాలో ఎక్కువ శాతం ఉన్న బీసీలకు? ఆ స్థాయిలో లబ్ధి చేకూరేలా చేస్తామని హామీ ఇచ్చారు. జనాభా లెక్కల ప్రకారం బీసీల రిజర్వేషన్లు పెంచుతామని.. నిధులు కూడా జనాభా ప్రకారం ఆ వర్గాలకు ఖర్చు పెడతామని అన్నారు. అందుకే రాష్ట్రంలో బీసీ కులగణన చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. నవంబర్ 6నుంచి కులగణన ప్రారంభం కాబోతోంది. ఇప్పటికే పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. గతంలో ఏ సర్కార్ చేయని సాయాన్ని.. తమ ప్రభుత్వం చేస్తుందనే అంశాన్ని బీసీల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం తీసుకుంది.జనగణన ద్వారా బీసీలకు జరిగే లబ్ధిని.. ప్రతీ గ్రామంలో తెలియజేయాలని.. కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. గ్రామ కమిటీల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని.. నేతలను పార్టీ పెద్దలు ఆదేశించారు. బీసీల్లో మెజారిటీ జనాలను పార్టీ వైపు తిప్పుకుంటే.. వచ్చే ఎన్నికల్లో అధికారానికి ఢోకా ఉండదని.. హస్తం పార్టీ నేతలు అంచనా వేస్తున్నారని టాక్. దీనికోసం బీసీల్లో ఆయా కులా సంఘాల పెద్ద మనుషులను రంగంలోకి దింపబోతున్నారని సమాచారం. ఆయా కులాల మీటింగ్‌లు పెట్టి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న బీసీ జనగణన, దాని ద్వారా బీసీలకు జరిగే మేలును వివరిస్తారని తెలుస్తోంది. దీని కోసం కాంగ్రెస్‌లో ఉన్న బీసీ ముఖ్యనేతలంతా? ఈ మధ్యే కీలక సమావేశం కూడా నిర్వహించుకున్నారట. బీసీ కులగణనపై ప్రభుత్వం కూడా త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని చూస్తోంది.మొత్తం బీసీల్లో 60శాతం ఓటు బ్యాంకును.. పార్టీ వైపు మళ్లించగలిగితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి కొలువు దీరడం ఖాయం అని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారట. తెలంగాణలో బీసీల?లో కీలకమైన యాదవ, గౌడ, ముదిరాజ్, పద్మశాలిలాంటి కులాలను పూర్తి స్థాయిలో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేలా వ్యూహాలు రచిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు తర్వాత.. వివిధ హోదాల్లో బీసీల్లో ఎంతమందికి అవకాశం ఇచ్చామనే అంశాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వివరించబోతుందని తెలుస్తోంది. బీసీ కులగణన ద్వారా దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందని.. నవంబర్ 31 లోగా కులగణన పూర్తి చేసి.. భవిష్యత్ యుద్ధానికి సిద్ధం కావాలని చూస్తోంది. కులగణన ఒక ఎక్స్ రే అని.. మెగా హెల్త్ చెకప్‌కు శ్రీకారం చుట్టామని కాంగ్రెస్ నేతలు పదేపదే చెప్తోంది కూడా ఇందుకేనట.బీసీ కులగణన పూర్తి చేసి.. తెలంగాణ నుంచి సరికొత్త పొలిటికల్ వార్‌కు శ్రీకారం చుట్టాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. బీసీ జపం.. కులగణన.. కాంగ్రెస్‌కు మరోసారి అధికారానికి దారి చూపిస్తుందా.. హస్తం పార్టీ నేతల అంచనాలు నిజం అవుతాయో లేదో చూడాలి మరి.

# స్వైర విహారం చేస్తున్న కుక్కలు

హైదరాబాద్, నవంబర్ 4, హైదరాబాద్ లో వీధికుక్కలు భయపెడుతున్నాయి. ఇంటి నుంచి బయట అడుగు పెట్టాలంటేనే భయమేసే పరిస్థితి వచ్చింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఎక్కడ చూసినా.. ఏ వీధిలో చూసినా గుంపులు.. గుంపులు వీధికుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. బయటకు వచ్చిన వెంటనే అవి మీద పడి కరిచేస్తున్నాయి. ఒంటరిగా మహిళలు, వృద్ధులు, పిల్లలు బయటకు రావడానికే జంకుతున్నారు. ఒకవేళ పొరపాటున వస్తే కుక్కల బారిన పడి గాయాలపాలవుతున్నారు. దీంతో హైదరాబాద్ లో కుక్కలను పారదోలండయ్యా బాబూ అంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు. తమ వీధికి మున్సిపాలిటీ కుక్కల వ్యాన్ వచ్చి కొన్ని నెలలవుతుందని తెలిపారు. వీధి కుక్కల బారిన పడి తాజాగా బోరబండలో ఒక బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎక్కువ మంది చిన్నారులు, వృద్ధులు, మహిళలు కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందేందుకు వస్తున్నారు. వందల సంఖ్యలో రోగులు వస్తుండటంతో రేబిస్ వ్యాక్సిన్ కూడా కొన్ని ఆసుపత్రుల్లో దొరకడం లేదు. బయట నుంచి తెచ్చుకోవాలంటూ ఆసుపత్రి సిబ్బంది చెబుతుండటంతో గాయపడిన వారి బంధువులు ఆవేదన చెందుతున్నారు. ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళ హైదరాబాద్ లో ఈ కుక్కల దాడి ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఏదైనా బజారు నుంచి తెచ్చుకోవాలనుకున్నా మహిళలు భయపడిపోతున్నారు. వాటి కోసం కుక్కలు వెంటపడి తరుముతున్నాయి. ప్రతి వీధిలోనూ పదుల సంఖ్యలో వీధికుక్కలు మహిళలు, చిన్నారులపై విరుచుకుపడిన సందర్భాలు ఇటీవల కాలంలో అనేకం ఉన్నాయి. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని, కుక్కల బెడద హైదరాబాద్ నగరంలో సమస్య మాత్రం చాలా తీవ్రంగా ఉందని చెబుతున్నారు. రాత్రి వేళ ఆ కుక్కల అరుపులతో నిద్ర కూడా పట్టడం లేదని, వీటిని ఇక్కడి నుంచి తరలించాలంటూ అనేక మంది మున్సిపల్ సిబ్బందికి మొరపెట్టుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోక పోవడంతో కుక్కల బెడద హైదరాబాద్ ను పట్టుకుని వేధిస్తూనే ఉంది.

# సినిమా



## రోబో రంగంలోకి దిగితే..?



పలు సూపర్ హిట్ సీరియల్స్, సినిమాల్లో నటించి పాన్ ఇండియా వీక్షకుల ఆదరణ పొందడంతో పాటు సోషల్ మీడియాలో ఎంతో క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ జ్యోతి పూర్వజ్. ఆమె ప్రధాన పాత్రలో 'శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో అందరినీ ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్. వీరిద్దరి కాంబోలో 'కిల్లర్' అనే యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజరు కామత్, ఎ. పద్మనాభరెడ్డి కలయికలో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది.ఈ చిత్రంలో పూర్వాజ్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆదివారం 'కిల్లర్' పార్ట్ 1: డ్రీమ్ గర్ల్ మూవీ నుంచి జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ తో పాటు మోషన్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. చేతిలో గొడ్డలి పట్టుకున్న పవర్‌ఫుల్ మహిళా రోబోను పరిచయం చేశారు. ఆ రోబో జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్‌గా మారడం ఆసక్తికరంగా ఉంది. జ్యోతి పూర్వజ్ క్యారెక్టర్ లుక్‌లో ఆమె ఒక భుజానికి వెజిటేబుల్స్ బ్యాగ్, మరో చేతిలో గొడ్డలి పట్టుకుని ఉంది. అద్దంలో ఆమె రిఫ్లెక్షన్ పవర్ ఫుల్ ఉమెన్ రోబోను చూపిస్తోంది. మోషన్ పోస్టర్‌లో చూపించిన ఎలిమెంట్స్ అన్నీ ఈ మూవీపై క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్నాయి.

## కమల్ హాసన్‌కు రజనీ అభినందన



శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం అమరన్. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. రాజా కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్ దీనిని నిర్మించారు. ఈ నేపథ్యంలోనే అగ్రకథానాయకుడు రజనీకాంత్‌కోసం చిత్రబృందం స్పెషల్ స్క్రీనింగ్ ఏర్పాటు చేసింది. సినిమా చూసిన వెంటనే ఆయన కమల్‌హాసన్‌కు ఫోన్ చేసి అభినందించారు. అద్భుతమైన చిత్రాన్ని నిర్మించారని మెచ్చుకున్నారు. ప్రత్యేకంగా చిత్రబృందాన్ని కలిసి, టీమ్‌వర్క్‌ని ప్రశంసించారు. నటీనటుల యాక్టింగ్, సినిమా మేకింగ్ బాగుందని చెప్పారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. కొన్ని ఫొటోలను షేర్ చేసింది. 2014లో జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాటం చేస్తూ మరణించిన వీరుడు మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో 'అమరన్' చిత్రాన్ని తెరకెక్కించారు. వరదరాజన్‌గా శివకార్తికేయన్ నటించగా, భార్య ఇందు రెబెకా జాన్ వర్ఘీస్ పాత్రలో సాయిపల్లవి నటించారు.

## హిట్ కొట్టేశాం అంటున్నారు



హీరో కిరణ్ అబ్బవరం నటించిన లెటెస్ట్ మూవీ 'క'. దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా రెండు రోజుల్లో 13.11 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ నేపథ్యంలో శనివారం సక్సెస్‌మీట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, 'నేనేనా ఇంత పెద్ద సూపర్ హిట్ సినిమా చేశాననిపిస్తోంది. ఇంకా నమ్మకం కుదరడం లేదు. అందుకే సక్సెస్ కిక్ రావడం లేదు. నా టీమ్ అందరికీ శుభాకాంక్షలు చెబుతున్నా' అని చెప్పారు. 'ఈ సినిమా నా దగ్గరకు తీసుకొచ్చినప్పుడు ఈ సినిమాతో ఏదో మ్యాజిక్ జరుగుతుంది. మనం ఇరవై కోట్లు కాదు వంద కోట్ల సినిమా కొడుతున్నాం అని హీరో కిరణ్ చెప్పాడు. అతని మాటలే నాలో ఎంతో నమ్మకాన్ని కలిగించాయి. ఆ నమ్మకం ఈ రోజు నిజమైంది' అని డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'ఘన విజయాన్ని అందించి ఈ దీపావళికి నాకు పెద్ద గిఫ్ట్ ఇచ్చారు. థియేటర్స్ పెంచాలనే డిమాండ్ పెరుగుతోంది. సినిమా పరిశ్రమ నుంచి కూడా చాలామంది అప్రిషియేట్ చేస్తున్నారు. హిట్ కొట్టాడు అనకుండా హిట్ కొట్టేశాం అంటున్నారు. ఇది తమ విజయంగా భావిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అని తెలిపారు.

## సినిమాల్లో చెరగని ముద్ర వేసుకున్న అజయ్



టాలీవుడ్‌లో విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు అజయ్. కేవలం విలన్‌గానే కాకుండా, సహాయ నటుడిగా, కొన్ని సినిమాల్లో హీరో ఫ్రెండ్‌గా కూడా నటించి ప్రేక్షకులను అలరించాడు. విజయవాడలో జన్మించిన అజయ్ తన చిన్ననాటి నుంచే సినిమాల్లో నటించాలనే కోరికను కలిగి ఉన్నాడు. తన కలను సాకారం చేసుకునేందుకు చాలా కష్టపడ్డాడు. చిన్న చిన్న పాత్రలతో సినిమా రంగంలోకి అడుగు పెట్టిన అజయ్ ఆ తర్వాత విలన్ గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాడు. ఒక్కడు, సైనికుడు, పోకిరి, సింహాద్రి, విక్రమార్కుడు, సుబ్రహ్మణ్యం ఫర్ సేల్, సూపర్ మచ్చి వంటి అనేక సినిమాలు చేసి తనకంటూ ఒక భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ను పెంచుకున్నాడు. అజయ్ తన విలన్ పాత్రలతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాడు. అతని నటనలోని తీవ్రత, కళ్లలోని భావాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. తన పాత్రలకు పూర్తి న్యాయం చేయడంలో అజయ్ ఎప్పుడూ ముందు ఉంటాడు అని చెప్పాలి. అజయ్ చాలా సరళమైన వ్యక్తి. సినిమా ఇండస్ట్రీలో ఉన్నప్పటికీ అతను తనను తాను మార్చుకోలేదు. ఇదిలా ఉంటే అతని భార్య పేరు శ్వేత రాపూరీ. గతంలో ఈవిడ మోడల్ గా పనిచేసి 2017లో మిస్ ఇండియా పోటీలోనూ పాల్గొని ఫైనల్ వరకు వెళ్ళింది. ఆ తర్వాత అజయ్ శ్వేతాలు 2005లో వివాహం చేసుకున్న వెళ్ళకి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇకపోతే అజయ్ ఫ్యామిలీ ఎక్కువగా కనిపించదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటారు. టూర్లు, వెకేషన్స్ కు వెళ్లినప్పుడల్లా అజయ్ తో పాటు ఆయన భార్యశ్వేత తమ ఫ్యామిలీ ఫొటోస్ ను సోషల్ మీడియా లో షేర్ చేస్తుంటారు. వీటిని చూసిన అభిమానులు క్రేజీ కామెంట్స్ చేస్తుంటారు. అజయ్ ఫ్యామిలీ చాలా క్యూట్ గా ఉందని, ఇక భార్యశ్వేతహీరోయిన్ కు ఏ మాత్రం తక్కువ కాదంటూ స్పందిస్తున్నారు.

## ఘనంగా 'లక్కీ భాస్కర్' విజయోత్సవం



'నాగవంశీకి శుభాకాంక్షలు. ఒకప్పుడు నన్ను నేను, ఇప్పుడు వంశీలో వెతుక్కుంటున్నాను. 'లక్కీ భాస్కర్' సినిమా చూసిన తర్వాత నాకు దర్శకుడు వెంకీ అట్లూరిపై చాలా గౌరవం పెరిగింది. ప్రేమ కథలతో దర్శకుడిగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టిన తను 'సార్' సినిమా నుంచి రూట్ మార్చాడు. ఈ సినిమాలో తను రాసిన డైలాగ్‌లకు, క్యారెక్టర్లను హ్యాండిల్ చేసిన విధానానికి హ్యాట్సాఫ్' అని నిర్మాత దిల్‌రాజు అన్నారు. దుల్కర్ సల్మాన్, వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొంది, విడుదలైన సినిమా 'లక్కీభాస్కర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రానికి విశేష ఆదరణ లభిస్తోంది. రోజు రోజుకి వసూళ్లను పెంచుకుంటూ సంచలన విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించింది. చిత్ర బృందంతో పాటు నిర్మాత దిల్ రాజు, దర్శకులు నాగ్ అశ్విన్, హను రాఘవపూడి తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. కథానాయకుడు దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ, 'సినిమా బ్లాక్ బస్టర్ అని నాకు ఫస్ట్ మెసేజ్ చేసింది జి.వి.ప్రకాష్. వెంకీ–జి.వి ఇద్దరూ డైనమిక్ కాంబో. నిర్మాతలకు జి.వి.ప్రకాష్ లాంటి టెక్నీషియన్స్ కావాలి. ఎందుకంటే పాటలు గానీ, నేపథ్య సంగీతం గానీ ఆలస్యం చేయరు. తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. మీతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. నాగి, స్వప్న 'మహానటి' కోసం నన్ను సంప్రదించినప్పుడు నాకు తెలుగు రాదు అన్నాను.

## అందమైన గ్రామీణ నేపథ్య కథ

విప్లవ్ దర్శకత్వం వహిస్తూ, ప్రధాన పాత్ర పోషించిన సినిమా 'ఈసారైనా'. ఈ సినిమా ఈ నెల 8న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆదివారం చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో విప్లవ్ మాట్లాడుతూ, 'అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతూ ఒక నిరుద్యోగ యువకుడు అతని ప్రేమను వెతుక్కునే దిశగా ఎలా సాగుతాడు అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా మీ అందరి ముందుకు రావడానికి కారణం సంకీర్త్. మొదట్నుంచీ ఆయన మమ్మల్ని బాగా ఎంకరేజ్ చేసారు. ఈ సినిమాకి నేనే ప్రొడ్యూసర్‌ని. అన్నింటినీ కష్టమైనా మేనేజ్ చేశాను. టీజర్, సాంగ్స్ అన్నీ చూడండి. నచ్చితే, సినిమా చూడండి' అన్నారు. 'శిరీష క్యారెక్టర్ నాతో చేయించిన విప్లవ్‌కి కృతజ్ఞతలు. నా ఫస్ట్ సినిమాకి ఇలాంటి క్యారెక్టర్ రావడం సంతోషంగా ఉంది. ఇది సినిమా మాత్రం కాదు. ఒక ఎక్స్‌పీరియన్స్ అని చెప్పొచ్చు' అని హీరోయిన్ అశ్విని చెప్పారు. కో ప్రొడ్యూసర్ సంకీర్త్ మాట్లాడుతూ, 'నా దృష్టిలో చిన్న సినిమా, పెద్ద సినిమా అంటూ ఏమి ఉండదు. ఒక సినిమా మనతో పాటు ఇంటికి వచ్చిందంటే, అది అందరికీ నచ్చుతుంది. ఈ సినిమాలో కూడా అందరూ ఫీల్ గుడ్ ఎక్స్‌పీరియన్స్ పొందుతారు' అని తెలిపారు. ప్రదీప్ రాపర్తి, మహబూబ్ బాషా, కార్తికేయ దేవ్, నీతు క్వీన్, సత్తన్న, అశోక్ మూలవిరాట్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: విప్లవ్, సహ నిర్మాత: సంకీర్త్ కొండా, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే– దర్శకత్వం: విప్లవ్, సంగీతం: తేజ్, డి ఓ పి: గిరి, ఎడిటింగ్: విప్లవ్, కళ: దండు సందీప్ కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అభినరు కొండ, లైన్ ప్రొడ్యూసర్: పూర్ణిమ రెడ్డి.





# క్రీడలు



## ప్రో కబడ్డీ లీగ్ 11లో సరికొత్త రికార్డ్



ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో 31వ మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 40-38తో హర్యానా స్టీలర్స్‌ను ఓడించింది. ఏడో సీజన్ తర్వాత బెంగాల్ వారియర్స్ తొలిసారి హర్యానా స్టీలర్స్‌ను ఓడించింది. ఈ విధంగా ఐదేళ్ల కరువుకు తెరపడింది. వెటరన్ రైడర్ మణిందర్ సింగ్ బెంగాల్ తరపున అద్భుత ప్రదర్శన చేసి ఈ సీజన్‌లో తన మొదటి సూపర్-10ని సాధించాడు. అతను మొత్తం 12 పాయింట్లు సాధించాడు. కాగా, డిఫెన్స్‌లో కెప్టెన్ ఫజల్ అత్రాచలి అద్భుత ప్రదర్శన చేసి 4 పాయింట్లు సాధించాడు. మరోవైపు హర్యానా స్టీలర్స్‌కు చెందిన మహ్మద్రెజా షాద్లూ అద్భుతంగా ఆడి 9 పాయింట్లు సాధించినా ఇతర ఆటగాళ్ల నుంచి అతనికి అంతగా మద్దతు లభించలేదు. హర్యానా స్టీలర్స్ అద్భుతంగా ఆరంభించింది. తొలి 10 నిమిషాల్లో హర్యానా జట్టు ఆధిక్యం ప్రదర్శించింది. హర్యానా తరపున రైడర్లు అద్భుతంగా రాణిస్తున్నారు. డిఫెన్స్ కూడా వారికి బాగా మద్దతునిస్తోంది. అయితే, 10 నిమిషాల తర్వాత బెంగాల్ వారియర్స్ పునరాగమనం చేసింది. మణీందర్ సింగ్ రైడింగ్‌లో పాయింట్లు సాధించడంతో పాటు డిఫెన్స్ కూడా తన పని తాను చేసుకుపోయింది. దీని కారణంగా పోటీ పూర్తిగా సమానంగా మారింది. హర్యానా స్టీలర్స్ జట్టు ఆధిక్యాన్ని కొనసాగించలేకపోయింది. రెండో అర్ధభాగానికి ముందు బెంగాల్ హర్యానా స్టీలర్స్‌కు ఆలౌట్ చేసి ఆధిక్యాన్ని అందించింది. అయితే ఆ తర్వాత హర్యానా మ్యాచ్‌ను సమం చేయడంతో స్కోరు 19-19తో సమమైంది. ద్వితీయార్ధం ఆరంభంలో బెంగాల్ వారియర్స్ సూపర్ ట్యాకిల్ ద్వారా రెండు పాయింట్లు సాధించి రెండు పాయింట్ల ఆధిక్యాన్ని కూడా సాధించింది. ఆ తర్వాత బెంగాల్ క్రమంగా ఆధిక్యాన్ని బలోపేతం చేసుకోవడం ప్రారంభించింది. మణిందర్ సింగ్ అద్భుతంగా ఆడుతున్నాడు. అందుకే, బెంగాల్ నిరంతరం పాయింట్లు సాధిస్తోంది. మణిందర్ సింగ్ ఈ సీజన్‌లో తొలి సూపర్-10 సాధించాడు. మరోవైపు, వినయ్ హర్యానా స్టీలర్స్ తరపున బాగా రాణిస్తున్నాడు. కానీ, ఇతర రైడర్ల నుంచి అతనికి అంతగా మద్దతు లభించలేదు. నవీన్ కూడా పాయింట్లు సాధించడం ప్రారంభించినప్పటికీ బెంగాల్ ఆధిక్యం చెక్కుచెదరలేదు. మ్యాచ్‌లో చివరి రెండున్నర నిమిషాలు మిగిలి ఉండగానే హర్యానా స్టీలర్స్ జట్టు మరోసారి ఆలౌట్ కావడంతో ఇక్కడి నుంచే ఓటమి ఖరారైంది.

## టీమిండియా ఓటమిపై ప్రశ్నలు సంధించిన క్రికెట్ గాడ్..



న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఓటమిని భారత్‌లో ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఆటగాళ్ల ప్రదర్శనపై అభిమానులు, పలువురు భారత అనుభవజ్ఞులు ప్రశ్నలు సంధిస్తున్నారు. క్రికెట్ దేవుడుగా పేరుగాంచిన సచిన్ టెండూల్కర్ కూడా ఈ అవమానకరమైన ఓటమి తర్వాత తనను తాను ఆపుకోలేకపోయాడు. సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేస్తూ టీమిండియా ఆటతీరుపై ఘాటుగా స్పందించాడు. ఈ సిరీస్‌లో ఓడిపోవడంపై సచిన్ 3 పెద్ద ప్రశ్నలను అడిగాడు. అయితే, ఈ మ్యాచ్‌లో జట్టును నిలబెట్టడానికి తమ శాయశక్తులా ప్రయత్నించిన శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్‌లను కూడా అతను ప్రశంసించాడు. టీమిండియా అవమానకరమైన ఓటమి గురించి మాట్లాడితే, సచిన్ టెండూల్కర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఙలో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. 'హోమ్ గ్రౌండ్‌లో 3-0తో ఓడిపోవడం చాలా కష్టం. ఆత్మపరిశీలన అవసరం అంటూ రాసుకొచ్చాడు. అలాగే, 'ఇది ప్రిపరేషన్ లోపమా, పేలవమైన షాట్ ఎంపికనా, లేదా మ్యాచ్ ప్రాక్టీస్ లోపమా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ 90 పరుగులు చేయగా, పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ హాఫ్ సెంచరీలు సాధించాడు. ఈ ఆటగాళ్లను ప్రశంసిస్తూ, సచిన్ 'శుభ్మన్ గిల్ మొదటి ఇన్నింగ్స్‌లో ఫ్లెక్సిబిలిటీని కనబరిచాడు. రిషబ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అద్భుతంగా ఆడాడు. అతని ఫుట్‌వర్క్ మైదానాన్ని పూర్తిగా భిన్నంగా చేసింది. అతను నిజంగా అద్భుతంగా ఉన్నాడు' అంటూ చెప్పుకొచ్చాడు. సచిన్ టెండూల్కర్ తన పోస్ట్‌లో న్యూజిలాండ్ జట్టుపై ప్రశంసలు కురిపించాడు. 'సిరీస్ అంతటా స్థిరమైన మంచి ప్రదర్శన కోసం పూర్తి క్రెడిట్ న్యూజిలాండ్‌కు చెందుతుంది. భారత్‌లో 3-0తో గెలవడం అత్యుత్తమ ఫలితం. న్యూజిలాండ్ తన క్రికెట్ చరిత్రలో తొలిసారిగా భారత్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. అదే సమయంలో, ఒక జట్టు తన సొంత మైదానంలో 3 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్వీప్ చేయడం ఇదే తొలిసారి.

## కేఎల్ రాహుల్‌కు బీసీసీఐ అగ్ని పరీక్ష..

న్యూజిలాండ్‌తో సిరీస్ ఓటమి తర్వాత టీమిండియా టెస్టు జట్టులో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆస్ట్రేలియాతో జరిగే బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌కు ఎంపికైన కేఎల్ రాహుల్‌ను ఇప్పుడు ఇండియా ఎ జట్టుకు ఆడమని చెప్పినట్లు సమాచారం. మెల్‌బోర్న్‌లో భారత్‌-ూ జట్టు ఆస్ట్రేలియా-ూతో టెస్ట్ సిరీస్ ఆడుతోంది. ఈ సిరీస్‌లోని రెండవ మ్యాచ్‌కు ముందు భారతదేశం ూ జట్టును సమీకరించాలని దీజజ× ఖూ రాహుల్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ధృవ్ జురెల్‌ను ఆదేశించినట్లు తెలిసింది. అందుకే, టీమ్ ఇండియాకు వెళ్లే ముందు కేఎల్ రాహుల్, ధృవ్ జురెల్ ఆస్ట్రేలియా వెళ్లనున్నారు. నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు ముందు, కెఎల్ రాహుల్‌ను ఆస్ట్రేలియా ఎతో ఆడాలని చెప్పారు. అలాగే వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ధృవ్ జురెల్ కూడా ఇండియా ఎ జట్టులో చేరాలని సూచించాడు. ఈ ఇద్దరు ఆటగాళ్లు న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో భాగంగా ఉన్నారు. అయితే కేఎల్ రాహుల్ తొలి టెస్టు మ్యాచ్‌లో మాత్రమే కనిపించాడు. రిషబ్ పంత్ మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పుడు ధృవ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. ఇప్పుడు వీరిద్దరినీ ఇండియా ఎ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐ నిర్ణయించింది. నవంబర్ 7 నుంచి భారత్ ఎ, ఆస్ట్రేలియా ఎ జట్ల మధ్య 4 రోజుల టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. దీంతో కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ మంగళవారం ఉదయం ఆస్ట్రేలియా వెళ్లే అవకాశం ఉంది. తద్వారా వారు సమయానికి అక్కడికి చేరుకోవచ్చు. ఒకవేళ కెఎల్ రాహుల్ భారత్ ఎ జట్టుకు ఆడటంలో విఫలమైతే, అతడిని టెస్టు జట్టు నుంచి తప్పిస్తారా? ఎందుకంటే ఆసీస్ పిచ్‌పై భారత్ ఎ జట్టు ఆటగాళ్లు మంచి ప్రదర్శన చేశారు. అందువల్ల బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్‌కు ముందే కేఎల్ రాహుల్‌కు అగ్నిపరీక్ష ఎదుర్కొనబోతున్నాడు. అయితే ప్రాక్టీస్ కోసమే కేఎల్ రాహుల్ ను ఇండియా ఏ జట్టులో ఆడమని ఆదేశాలు ఇచ్చినట్లు బీసీసీఐ చెబుతోంది.



## రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా క్రికెటర్




భారత వికెట్ కీపర్-బ్యాటర్ వృద్ధిమాన్ సాహా అన్ని రకాల క్రికెట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ సీజన్ తన చివరి సీజన్ అని వృద్ధిమాన్ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా తెలియజేశాడు. ఈ స్టంపర్ 40 టెస్టులు, 9 వన్డేల్లో భారత్ తరపున ఆడాడు. ధోనీ, పంత్ తర్వాత భారత్ తరఫున అత్యధిక సెంచరీలు సాధించిన కీపర్‌లలో వృద్ధిమాన్ సాహా రెండో స్థానంలో ఉన్నాడు. సాహా తన కెరీర్‌లో మూడు సెంచరీలతో 1353 టెస్ట్ పరుగులు చేశాడు. సాహా తన చివరి టెస్టులో మూడేళ్ల క్రితం అంటే 2021లో న్యూజిలాండ్‌పై ఆడాడు. సిరీస్‌లో కొన్ని కీలకమైన నాక్‌లు ఆడినప్పటికీ, ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మలతో కూడిన అప్పటి కొత్త టీమ్ మేనేజ్‌మెంట్, రిషబ్ పంత్ బ్యాకప్‌గా ఖూ భరత్‌పై దృష్టి సారించి సాహాను జట్టు నుండి తొలగించాలని నిర్ణయించుకుంది. సాహా ఈ నెలాఖరులో జరగనున్న మెగా వేలం కోసం నమోదు చేసుకోకపోవడంతో వచ్చే ఏడాది ఙూలో పాల్గొనే అవకాశం లేదు. అతను ఈ విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించనప్పటికీ, వేలానికి ముందు దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల కావచ్చని తెలుస్తుంది. సాహా గత మూడేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న గుజరాత్ టైటాన్స్ ఫ్రాంఛైజీ అతని రిటైన్ చేసుకోలేదు. కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), పంజాబ్ కింగ్స్ , సన్‌రైజర్స్ హైదరాబాద్, ఐదు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించి, 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుండి ప్రతి సీజన్‌లో పాల్గొన్న అతి కొద్ది మంది ఆటగాళ్లలో సాహా ఒకరు కావడం విశేషం.

## భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత చెత్త ఏడాది

గత కొన్నేళ్లుగా టెస్టు ఫార్మాట్‌లో టీమిండియా ఆధిపత్యం కొనసాగిస్తోంది. కానీ 2024లో టీమ్ ఇండియా ప్రదర్శన అంచనాల కంటే దారుణంగా ఉంది. భారత జట్టు న్యూజిలాండ్‌తో స్వదేశంలో ఈ ఏడాది చివరి టెస్టు సిరీస్ ఆడింది.అయితే ఈ సిరీస్‌లో భారత ఆటగాళ్లు చాలా అవమానకరమైన ప్రదర్శన కనబరిచారు. భారత జట్టు 3 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా గెలవలేక క్లీన్ స్వీప్ చేసింది. న్యూజిలాండ్ భారత్‌కు వచ్చి టెస్టు సిరీస్‌ను గెలవడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. దీంతో 55 ఏళ్ల తర్వాత భారత్‌లో ఇంత దారుణమైన పరిస్థితి కనిపించింది. ఈ ఏడాది స్వదేశంలో టీమిండియా మూడు టెస్టుల సిరీస్‌లు ఆడింది. ఈ ఏడాది తొలి టెస్టు సిరీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడింది. తొలి మ్యాచ్‌లో 28 పరుగుల తేడాతో ఓడిపోయిన భారత జట్టు 4-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో 2 టెస్టు మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. కానీ, న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియాకు ఏదీ అనుకూలంగా లేకపోవడంతో క్లీన్‌స్వీప్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ ఏడాది స్వదేశంలో టీమ్ ఇండియా మొత్తం 4 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇది చాలా షాకింగ్ ఫిగర్. భారత క్రికెట్ చరిత్రలో టీం ఇండియా స్వదేశంలో ఏడాది వ్యవధిలో 4 టెస్టు మ్యాచ్‌లు ఓడిపోవడం ఇది రెండోసారి మాత్రమే. ఇంతకుముందు, 1969లో భారత జట్టుతో ఇలాగే జరిగింది. అప్పుడు కూడా ఆ సంవత్సరంలో భారత జట్టు మొత్తం 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. అంటే, 55 ఏళ్ల తర్వాత టీమిండియాకు స్వదేశంలో అలాంటి పరిస్థితి కనిపించింది. ఇది భారత ఆటగాళ్లతో పాటు అభిమానులు కూడా ఎక్కువ కాలం మరిచిపోలేరు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఈ నిరాశాజనక ఓటమిని తన కెరీర్‌లో చెత్త దశగా అభివర్ణించాడు. టెస్ట్ సిరీస్‌లో ఓటమికి పూర్తి బాధ్యత వహించాడు. మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో రోహిత్ మాట్లాడుతూ, 'ఇలాంటి ప్రదర్శన నా కెరీర్‌లో చెత్త దశ అవుతుంది. దానికి పూర్తి బాధ్యత వహిస్తాను. సిరీస్ కోల్పోయిన వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టం.

## మెగా వేలానికి వేదిక ఫిక్స్..



ఇటీవల, ఙూ 2025 మెగా వేలానికి ముందు, అన్ని ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఐపీఎల్ వేలం తేదీ, వేదిక గురించి కీలక అప్‌డేట్ వచ్చింది. తాజాగా వినిపిస్తోన్న సమాచారం ప్రకారం రియాద్‌లో వేలం నిర్వహించనున్నారు. వేలం వేదికగా రియాద్‌ను బీసీసీఐ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ మెగా వేలం నవంబర్ చివరి వారంలో నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమయంలో భారతదేశంలో పండుగ, వివాహాల సీజన్. ఈ కారణంగా వేలం నిర్వహించడానికి దీజజ× విదేశాల్లో ప్లాన్ చేసినట్లు వినిపించాయి. భారతదేశంలో కూడా, బోర్డు కొన్ని ప్రాంతాలను ఎంచుకుంది. కానీ పండుగ, పెళ్లిళ్ల సీజన్ కారణంగా, హోటళ్లు అందుబాటులో లేవు. దీజజ× సౌదీ అరేబియాలోని రెండు నగరాలు, రియాద్, జెద్దాలో ఎంపికలను అన్వేషిస్తోంది. ఎంపికలను అన్వేషించడానికి బోర్డు సౌదీ అరేబియాకు బృందాలను కూడా పంపింది. బీసీసీఐ అధికారులు రెండు నగరాలను సందర్శించారు. ఆ తర్వాత రియాద్‌ను ఖరారు చేశారు. వేలం తేదీ గురించి మాట్లాడితే, దీనిని నవంబర్ 24న నిర్వహించవచ్చు అని తెలుస్తోంది. అందరి చూపు ఐపీఎల్ మెగా వేలం పైనే ఉంది. ఎందుకంటే ఈ వేలంలో అన్ని ఫ్రాంచైజీలు కొత్త జట్టును సిద్ధం చేస్తాయి. ఇటీవల అన్ని ఫ్రాంచైజీలు కొంత మంది ఆటగాళ్లను రిటైన్ చేసి మిగిలిన వారిని విడుదల చేశాయి. రిషబ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, మిచెల్ స్టార్క్, మహ్మద్ సిరాజ్, యుజ్వేంద్ర చాహల్, మహ్మద్ షమీ, గ్లెన్ మాక్స్‌వెల్, ఇషాన్ కిషన్‌లతో సహా చాలా మంది పెద్ద పేర్లు వేలంలో కనిపించనున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహా పలు జట్లు ఇప్పుడు కొత్త కెప్టెన్ కోసం వెతుకుతున్నాయి. ఫ్రాంచైజీలు నిలుపుదలలో అనేక ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకున్నాయి. ధృవ్ జురెల్, రింకూ సింగ్, మతిషా పతిరానాతో సహా కొంతమంది ఆటగాళ్లకు ఊహించని ప్రైజ్ మనీ దక్కింది. జురెల్ జీతం రూ.20 లక్షల నుంచి రూ.14 కోట్లకు పెరిగింది. కాగా, రింకూ ఆదాయం రూ.55 లక్షల నుంచి రూ.13 కోట్లకు పెరిగింది. పతిరానా జీతం రూ.20 లక్షల నుంచి రూ.13 కోట్లకు, మయాంక్ యాదవ్, రజత్ పటీదార్ల జీతం రూ.20 లక్షల నుంచి రూ.11 కోట్లకు పెరిగింది.

# జిల్లా యాదవ సంఘం నిర్మాణంలో గోవిందరావు సేవలు మరువలేనివి

## చంద్రకాని గోవిందరావు దశదినకర్మ కార్యక్రమం లో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



ఖమ్మం ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాబలం)1992 – 93లో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో, జిల్లా యాదవుల ఐక్యత కోసం యాదవ సంఘం అభివృద్ధి కోసం చంద్రకాని గోవిందరావు చేసిన కృషి మరువలేనిదని ఉందని, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తూరు సింహాద్రి యాదవ్ అన్నారు.

ఇటీవల అనారోగ్యంతో మరణించిన చంద్రకాని గోవిందరావు గారి స్వగృహం నేలకొండపల్లి మండలం భైరవుని పల్లి గ్రామంలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో అఖిల భారత మహాసభ నాయకులు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, గోవిందరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఉద్యోగం ఉన్నప్పటికీ, పదవీ విరమణ అయిన తర్వాత కూడా యాదవుల అభ్యున్నతి కోసం ఆలోచించేవాడని నాటి యాదవ సంఘం పెద్దలు బోళ్ల వెంకటేశ్వరరావు, అమరబోయిన సైదయ్య, మీగడ కన్నయ్య, నాటి మంత్రివర్యులు సంగెం రెడ్డి సత్యనారాయణ, చిత్తారు శ్రీహరి , మరియు దుబాకుల శ్రీనివాస్ లాంటి పెద్దల సహకారంతో గోవిందరావు తో పాటు నేను కూడా ఆ రోజు లలో జిల్లా అంతట పర్యటించి, గొర్రెల సంఘాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని మల్లి బాబు యాదవ్ గుర్తు చేసుకున్నారు. ఆనాడు ఎలాంటి స్వార్థం లేకుండా పనిచేశారని, కృషి ఫలితమే ఈనాటి యాదవ సంఘం అభివృద్ధి అని తెలిపారు. యాదవ సంఘం పెద్దలమని చెప్పుకుని తిరిగే ఈనాటి నాయకులు ఆ రోజులలో కంటికి కూడా కనిపించలేదని, అలాంటి వ్యక్తి చనిపోవడం నాకు వ్యక్తిగత%శీ% గా తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుబాకుల శ్రీనివాస్, మల్లెబోయిన శ్రీనివాస్,మేకల లక్ష్మీనారాయణ, చంద్రకాంత్ గట్టయ్య బుర్ర వెంకన్న కనక బండి కనకరాజు, కనక బండి రమేష్ మేకల మల్లికార్జునరావు మరియు తదితరులు పాల్గొన్నారు



# అధ్యక్షునిగా సర్దార్ రంజీత్ సింగ్

ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ నవంబర్ 04 : మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట లోని స్థానిక గురునానక్ గార్డెన్ లో 10 జిల్లాల సిక్లిగర్ (సిక్కు) కుల సంగం లో జరిగిన సమావేశంలో లక్షెట్టిపేటకు చెందిన సర్దార్ రంజీత్ సింగ్ ను ఏకగ్రీవంగా 10 జిల్లాల(ఆదిలాబాద్, కొమురం భీమ్ అసిఫాబాద్, మంచిర్యాల,నిర్మల్, పెద్దపల్లి,కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్,రాజన్న సిరిసిల్ల,సిద్ధిపేట) అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో 10 జిల్లాల సిక్లిగర్ అధ్యక్షులు దేశాయ్ సింగ్,సంతోక్ సింగ్,చతర్ సింగ్, ప్రతాప్ సింగ్,ధ్యాన్ సింగ్,కిర్ పాన్ సింగ్, రామ్ సింగ్, జగన్ సింగ్,ఇంద్రజిత్ సింగ్, జిందాల్ సింగ్, జీత్ సింగ్,అనిల్ సింగ్, జితేందర్ సింగ్, రామారావు సింగ్ సిక్ సోదరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

## జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్బి) రాధికా గుప్తా



ప్రజా బలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 4: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను జిల్లా అదనపు కలెక్టురు విజయేందర్ రెడ్డి తో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్బి) రాధికా గుప్తా స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (59) ఫిర్యాదులు అందాయన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్, చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో వరిధాన్యం కొనుగోలు ప్రారంభం...

జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం సోమవారం ఉదయం ప్రారంభించారు.. జమ్మికుంట లోని పాత వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్, ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు తీసుకువచ్చే వడ్లని ఆరబెట్టుకుని తీసుకురావాలని తేమశాతం 17% లోపు ఉన్నట్లయితేనే కొనుగోలు చేయడం జరుగుతుందని గ్రేడ్ ఏ రకం క్వింటాల్ 2320 రూపాయలు, సాధారణ రకం 2300 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తామని తెలిపారు.. రైతులు పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ లు, అందించాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీ మల్లేశం, సీఈవో రవీందర్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్లు రాజయ్య, తిరుపతి, శ్రీలత, బక్కయ్య, తిరుపతిరావు రాధిక లింగారావు, రాజశేఖర్, కుమార్, సమ్మయ్య, రమాదేవి,లతోపాటు జమ్మికుంట ఆర్థిదారుల సంఘం అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, మరియు రైతులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# కుమ్మరుల ఐక్యత చాటుదాం...!

# కులగణనలో కుమ్మరి అని మాత్రమే రాద్దాం

## జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొగిలిచర్ల సైదులు, దరిపల్లి చంద్రశేఖర్



ఖమ్మం ప్రతినిధి నవంబర్ 4 (ప్రజాబలం) ఖమ్మం తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కులగణన కార్యక్రమంలో కుమ్మరులంతా పాల్గొని ఐక్యత చాటాలని శ్రీ మొల్లమాంబ కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొగిలిచర్ల సైదులు, దరిపల్లి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎన్టీఆర్ మార్గ్ లోని వారి కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో జరిగిన కుటుంబ సర్వేల్లో బీసీ, బీసీ బి, శాలివాహన ప్రజాపతి అని ఇలా ఒక్కొక్కరు ఒక్కోలాగా నమోదు చేయడం వల్లన తమ బలం ఇంత అని ఖచ్చితంగా చూపించలేక పోయమన్నారు ప్రస్తుతం జరగనున్న కులగణనలో కుమ్మర కులస్తులం అని ఖచ్చితంగా పొందుపర్చి తమ బలం, ఐక్యత చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రతి ఒక్క కుమ్మర కులస్తులు దీనిని గమనించి పాటించాలని కోరారు. దీని వల్ల భవిష్యత్తులో తమ కులానికి మరిన్ని ప్రయోజనాలు నమకూరుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు సిల్వర్ జనార్ధన్, చలిగంటి బిక్షమయ్య, చలగంటి శ్రీనివాస్, కోరంపల్లి శ్రీనివాస్, బుచ్చి రాములు, చంటి రాధాకృష్ణ, కొత్తపల్లి సర్వయ్య, గుమ్మడిదల వెంకటనారాయణ, పరుశురాం తదితరులు పాల్గొన్నారు

# జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కు ఏర్పాట్లు పూర్తి

## నవంబర్ 11 నుండి 14 వరకు

## సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ రమాకళ్యాణి



ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ అక్టోబర్ 04 : నవంబర్ 11 నుండి జరగబోయే జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ను జయప్రదం చేయాలని,అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సాంఘీక సంక్షేమ కళాశాల ప్రిన్సిపల్ రమాకళ్యాణి కోరారు. సోమవారం ఆమె కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాళేశ్వరం జోన్ పరిధిలోని పెద్దపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన పది పాఠశాలల విద్యార్థులు సుమారుగా పదమూడు వందల మంది ఈ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ లో పాల్గొంటారన్నారు. నవంబర్ 11 నుండి పద్నాలుగు వరకు నాలుగు రోజుల పాటు పలు పోటీలు జరగనున్నాయన్నారు.ఈ పోటీలకు వచ్చే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయా పాఠశాలలకు చెందిన పిఈటిలు, పీడీలు,ప్రిన్సిపాల్ లు సీనియర్ స్టాఫ్ తో పాటు ప్రైవేట్ పాఠశాలల నుండి పిఈటీలను వినియోగించుకుని జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ను విజయవంతం చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులను, అధికారులను ఈ స్పోర్ట్స్ మీట్ కు హాజరుకావల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట వైస్ ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 04: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దొమ్మటి సత్తమ్మ తన భర్త పేరిట బెల్లంపల్లి మండలం పెర్కపల్లి శివారులో గల భూమిని తన ఇద్దరు కుమారుల పేరిట విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని ఎల్.ఐ.సి.కాలనీ వాసులు తమ కాలనీ పరిధిలోని 15 ఫీట్ల రోడ్డు సందులో పండ్లు, కొబ్బరి బొండాల వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారం సాగించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని,ఈ విషయంపై పరిశీలించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మున్సిపల్ పరిధిలోని ఫ్లలనీకి చెందిన గరిగె మధునమ్మ తాను రెండు గదుల ఇల్లు నిర్మించుకున్నానని, ఇంటి నెంబర్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన గుండబోయిన కొమురయ్య, మల్లేష్, కొమురక్కలు తమకు కొండాపూర్ శివారులో గల భూమిని వేరొక వ్యక్తి అక్రమంగా తన పేరిట పట్టా మార్చుకోవాలని ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై విచారించి తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం అక్కపల్లిగూడ గ్రామానికి చెందిన ఏరుకొండ వనిత తన భర్త చనిపోయిన తర్వాత ఇద్దరు కుమారులు తన పోషణ చూసుకోవడం లేదని,పింఛన్ రావడం లేదని, తనను ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన పంచెర్పుల రాజయ్య తనకు అందుగులపేట మోరు శివారులో భూమి ఉందని,నూతన పట్టా పాస్పుస్తకంలో ఇట్టి భూమి నమోదు కానందున,సవరించి పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ బెల్లంపల్లి పట్టణ సమితి ప్రతినిధులు తమ దరఖాస్తులో బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్ సముదాయానికి కామ్రేడ్ గుండా మల్లేష్ నామకరణం చేయాలని కోరారు. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్లు తమ దరఖాస్తులో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరారు.బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామానికి చెందిన తోట శ్రీలత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన గుమ్ముల రాజవ్వ తాను పొందుతున్న దివ్యాంగుల పెన్షన్ను వితంతు పెన్షన్ మార్చి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.జైపూర్ మండలం ముదిగుంట గ్రామస్తులు తమ గ్రామంలోని కొందరు క్రైస్తవ మతాన్ని స్వీకరించి అక్రమంగా షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ సర్టిఫికెట్ పొందారని,ఈ విషయమై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సామర్లకోట భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో పంచారామాలో ఒకటైన కాకినాడ జిల్లా సామర్లకోట శ్రీ.కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## జపాన్ సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి మంచిర్యాల విద్యార్థిని ఎంపిక జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 04 : భారత ప్రభుత్వం, సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో జపాన్లో నిర్వహించే సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి మంచిర్యాల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యాసింగ్ ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)సబావత్ మోతిలాల్,జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్యతో కలిసి విద్యార్థినికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుండి 16వ తేదీ వరకు జపాన్లో జరుగన్ను సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థిని ప్రయాణ ఖర్చులు, వసతి అన్ని సౌకర్యాలు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, విద్యార్థిని సొంత ఖర్చులకు గాను సాదుల ప్రవీణ్ కుమార్-వనజ దంపతులు అందజేసిన 5 వేల రూపాయలు, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు అందించిన 2 వేల రూపాయలు, కస్తూరిబా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న అందించిన 2 వేల రూపాయలతో కలిసి మొత్తం 9 వేల రూపాయలను విద్యార్థిని విద్యాసింగుకు అందించడం జరిగిందని తెలిపారు. విద్యాసింగ్ చిన్న వయసులో అద్భుత అవకాశాన్ని చేజిక్కించుకుందని, అంతర్జాతీయ సైన్స్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో పాల్గొననుందని, అక్కడ విశిష్టతలు, నూతన ఆవిష్కర ణలను పరిశీలించి తన తోటి విద్యార్థులందరికీ తాను నేర్చుకున్న అంశాలను వివరించాలని తెలిపారు. ఈ పర్యటనలో శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చలలో పాల్గొనడం, స్పేస్ స్టేషన్,సైన్స్ కేంద్రాలను వీక్షించి, వారు కనుగొన్న సైన్స్ విషయాలను నేర్చుకోనుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు,కస్తూరిబా బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు




ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 4 :తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోపెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ బి. సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఎవ్వరైనా 100 రూపాయలు కట్టి సభ్యత్వం నమోదు చేసుకోవచ్చున్నారు. రెండు సంవత్సరాల కాలంలో సభ్యత్వం తీసుకున్న వారికి ఏదైనా ప్రమాదం జరిగితే 5 లక్షల రూపాయల ఉచిత భీమా అందజేయడం జరుగుతుందన్నారు. సహజ మరణం పొందితే పదివేల రూపాయలు మట్టి ఖర్చులకోసం పార్టీ ఇస్తుందన్నారు. ఎవరైనా తల్లిదండ్రులను కోల్పోతే అనాథ పిల్లలను ఒకటో తరగతి నుండి డిగ్రీ వరకు చదువు వసతిని కూడా ఉచితంగా పార్టీ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్, టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి ఎండి షరీఫా, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఆర్. జయ, ప్రధాన కార్యదర్శి జూపాక సంధ్య, మేకల సుగుణ, రాసుల సత్యనారాయణ, కవిత, మంజుల, అపర్ణ, చోటు, రాజేష్, జయశంకర్ లు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బెంచిల ఏర్పాటు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సొత్కు సుదర్శన్




ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 4 :లయన్స్ క్లబ్ ఆఫ్ మందమర్రి క్లబ్ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం పాత బస్టాండ్ మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న బస్టాండ్ స్టాఫ్ ఆవరణలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సొత్కు సుదర్శన్ తెలిపారు. మందమర్రి నుండి మంచిర్యాల వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం నిలబడి వేచి ఉంటున్నారని వారి సౌకర్యార్థం బస్టాండ్ ప్రాంతంలో మూడు సిమెంట్ బెంచిలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ లయన్ కొట్ల అనిత, ప్రెసిడెంట్ లయన్ కొక్కుల మధు, సెక్రటరీ లయన్ సొత్కు రత్న జానకి, లయన్ కొక్కుల కేదారి , లయన్ మొగల్ రమేష్ , ఎం.డి నిజాం, నోముల ఉపేందర్ గౌడ్, ఎం.డి హఫీస్, చంద్రయ్య, జక్కుల శేఖర్, ఉదయ్ రాజ్, కొమురయ్య, ఎం.డి షకూర్, రమేష్ మాన్కు లు పాల్గొన్నారు.

## టీటీడీ మెంబర్ మహేందర్ రెడ్డిని కలిసిన మాయ రమేష్



ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 4: ఆంధ్రప్రదేశ్ లోని పవిత్ర పుణ్య క్షేత్రం అయిన తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి సభ్యులుగా నియమితులైన తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డిని తన నివాసంలో జనసేన ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నాయకులు, మంథని నియోజక వర్గ ఇంచార్జీ మాయ రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐదు రోజులు కావస్తున్నా కోలుకొని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు.

కొమురం భీం వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వాంతులు విరోచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరుతూ విద్యార్థినిల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఐదు రోజులు గడుస్తున్నా ఇంకా విద్యార్థుల ఆరోగ్యం కుదుట పడలేదు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 13 మంది, ఆసిఫాబాద్ సర్కార్ , ప్రైవేటు దవాఖానాల్లో 15 మంది, మంచిర్యాల లో 6గురు చికిత్స పొందుతుండగా రాత్రి జ్యోతిక, మహాలక్ష్మి అనే ఇద్దరు విద్యార్థినులను హైదరాబాద్ నిమ్స్ కు రెఫెర్ చేశారు. విద్యార్థుల అనారోగ్యానికి గల కారణాలు, వారి ఆరోగ్యం పరిస్థితుల పై హాస్టల్ సిబ్బంది క్లారిటీ ఇవ్వకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్యవైశ్య మహాసభ యువజన ఉపాధ్యక్షుడిగా ఉప్పలంచి చంద్రకాంత్



ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 4 : మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా మందమర్రి పట్టణానికి చెందిన ఉప్పలంచి చంద్రకాంత్ ను నియమించారు. సోమవారం లక్షట్ పేట పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో జరిగిన జిల్లా సమావేశంలో మంచిర్యాల జిల్లా యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఉప్పలంచి చంద్రకాంత్ నియమిస్తూ నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైశ్య సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నాపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన జిల్లా అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు కు మిగతా కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మార్కెట్ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ కు వినతి



ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 4 :మందమర్రి మార్కెట్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మార్కెట్ వ్యాపార సంఘం నాయకులు మాయ రమేష్ ఆధ్వర్యంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు ను కలిసి వినతి పత్రం అందజేశారు. మార్కెట్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చొరవ చూపాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వ్యాపారస్తులు పిట్టల సుధాకర్, మర్రి ఐలయ్య, నెరువట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వాత్సల్య పిల్లల హాస్పిటల్ పై ప్రజావాణిలో కలెక్టర్ కి ఫిర్యాదు సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం




కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 4 లాభార్జనే ధ్యేయంగా పేద ప్రజల రక్తాన్ని జలగల పిలుస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాత్సల్య పిల్లల హాస్పిటల్ వైద్యుడి పై సోమవారం ప్రజావాణి లో కరీంనగర్ కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగిందని గట్టు సాయిరాం పేర్కొన్నాడు. జమ్మికుంట పట్టణంలో వాత్సల్య పిల్లల హాస్పిటల్ లో వారం రోజుల క్రితం జరిగిన సంఘటనను ఇప్పటివరకు కూడా జిల్లా వైద్యాధికారులు పట్టించుకోకుండా ఉన్నారని దీనిని బట్టి చూస్తే వైద్యాధికారులు వాత్సల్య పిల్లల హాస్పిటల్ కు కొమ్ము కాస్తున్నారా అని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని గట్టు సాయిరాం తెలియజేయడం జరిగింది. ప్రైవేట్ హాస్పిటల్ పెట్టి నాణ్యత లేని వైద్యాన్ని అందిస్తూ లాభార్జన ధ్యేయంగా అధిక సొమ్ములను తీసుకుంటూ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తు నన్ను అడిగే వారు లేరని వ్యవహరిస్తున్న వాత్సల్య పిల్లల హాస్పిటల్ పై తక్షణమే జిల్లా అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ విషయంపై కరీంనగర్ జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తక్షణమే జమ్మికుంట లోని వాత్సల్య పిల్లల హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి కి చెప్పడం జరిగింది.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.**.ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారుసోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం,వ్యవసాయం, పింఛన్లు,ధరణి,భూ సమస్యలు, రెండు పడక గదుల ఇండ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని, శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని, పరిష్కారానికి సంబంధించిన వివరాలను సంబంధిత దరఖాస్తుదారుడికి అందజేయాలన్నారు.అలాగే జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని ఆదేశించారు.మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు,గన్ని బ్యాగ్స్, టార్ప లీన్, వేయింగ్ మిషన్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ హాస్టలను నిరంతరం పర్యవేక్షించి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.ఈనెల 6న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్ల నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్,ఆర్డీవో రత్న కళ్యాణి,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా సారంగాపూర్, మండలంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**నిర్మల్ జిల్లా సారంగాపూర్, మండలంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు దేశ తొలి విద్యాశాఖ మంత్రి స్వాతంత్ర%అఅ% సమరయోధులు,భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలను నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంతోపాటు స్వర్ణ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సారంగాపూర్ తాజా మాజీ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, మాజీ ఎంపిటిసి పద్మ వీరయ్య,బిజెపి మండల నాయకులు కే,మహేష్ రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి, సొసైటీ జిల్లా వ్యవస్థాపకులు అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, సారంగాపూర్ మండల అధ్యక్షులు సయ్యద్ నాయిముద్దీన్ అబ్దుల్, మహమ్మద్ ఆజం, జమీర్,శేఖ్ మసూద్,నిర్మల్ పట్టణ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మొహమ్మద్ బిన్ అలీ,శేఖ్ ఇంత్యాజ్,శేఖ్ షాదుల్లా హుస్సేన్,శేఖ్ షకీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు వేరువేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భక్తులు మాట్లాడితే స్వాతంత్ర పోరాటంలో కీలక భూమిక పోషించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్రానంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశంలో విద్య, వైజ్ఞానిక,సాంకేతిక పరమైన అభివృద్ధికి తనదైన రీతిలో ప్రణాళిక రూపొందించుకొని ముందుకెళ్లారని గుర్తు చేశారు.

# హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

### జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికీ శిక్షలు తప్పవు ప్రజలు ఎవరు కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దు నిర్మల్

### జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** వయస్సు పై బడుతున్న తనకు పెళ్లి చేయయ్దం లేదనే కోపం తో సొంత తండ్రి నే నరికి చంపిన కొడుక్కి ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి కర్ణ కుమార్ గారు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు నిర్మల్ జిల్లా ఎస్పి ఒక ప్రకటనలో తెలిపారు.. అయితే నిర్మల్ టౌన్ లోని పింజరిగుట్ట కాలనీ కి చెందిన అప్పాల గణపతి, వ: 64 సం. లు అనునతనికి ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు కాగా కూతుళ్ళిద్దరికి పెళ్ళిళ్ళు చేశాడు. పెద్ద కొడుకు అభిలాష్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్ లో ఉండగా చిన్న కోడుకు/ నేరస్తుడు అప్పాల అవినాష్ తం: గణపతి,వ:30 సంబీలు అనునతను ఏం పని చేయకుండా తల్లి దండ్రుల మీధనే ఆధార పడుతుండే వాడు. అయితే కొన్ని రోజులులుగా తన కు పెళ్లి చేయమని తన తండ్రి/ మృతుణ్ణి బెదిరిస్తుండగా, పెద్ద కొడుక్కి పెళ్లి చేసినాకే చేస్తాము అని సముదాయించిన వినకుండా కక్ష్య పెంచుకున్నాడు. తేది: 13.06.2022 నాడు ఉదయం 11 గం. ల సమయంలో తన తండ్రి తో పెళ్లి గురించి గొడవ పడి కూరగాయల కత్తి తో దాడి చేయగా మృతుడు ఇంటి నుండి బయటకు వచ్చి పడిపోగా అట్టి సంఘటనా చూసి ఆపాడానికి వచ్చిన వారిని బెదిరించి లోపలికి వెళ్ళి కొడవలి తీసుకుని వచ్చి అతి కిరాతకంగా నరికినాడు. మృతుని అల్లుడు బోమెడ రాజు ఫిర్యాదు మేరకు అప్పటి నిర్మల్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్ కేసు నమోదు చేసి నెరస్తుని రిమాండు కి తరలించి చార్జి షీట్ వెయ్యగా గౌరవ మెజిస్ట్రేట్ నేరస్తుడు అప్పాల అన్వేష్ కి యావజ్జీవ కారాగార శిక్ష తో పాటు వెయ్యి రాపాయల ఫైన్ విధించినారు.

**ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.**

సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని, ప్రజలు ఎవరు కూడా చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని ఎస్పీ తెలిపారు. పోలిసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పైకేసులో నిందితులకి శిక్ష పడటం లో కృషి చేసిన వినోద్ రావు, అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ డల్లు సింగ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అంకుశ్ కానిస్టేబుల్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

## సమగ్ర సర్వేపై ఉపాధ్యాయులకు ఉద్యోగులకు శిక్షణ




ఇల్లందకుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 4 ఇల్లందకుంట మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక భవన్లో ఆరవ తేదీ నుండి ప్రారంభమయ్యే కుటుంబ సమగ్ర సర్వే నిర్వాహనపై మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు అంగన్వాడీ టీచర్స్ గ్రామ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్క ఇంట్లో ఉండే ప్రతి ఒక్క సభ్యుల వివరాలను నమోదు చేయాలని సర్వే పారదర్శకంగా నిర్వహించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎంపీడీవో పుల్లయ్య తాసిల్దార్ రాణి,మండల విద్యాధికారి ,ఏపీవో రాజేశ్వరరావు,ఐసిడిఎస్ సూపర్వైజర్, ఏపీఎస్ఓ,గ్రామ కార్యదర్శులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసి ప్రజావాణికి తరలివచ్చిన నగరవాసులు

హైదరాబాద్ జీహెచ్ంఎసి ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కి నగరవాసులు క్యూ కట్టారు. సర్కిల్, జోనల్ ఆఫీస్ లలో పరిష్కారం కానీ తమ సమస్యలకు హెడ్ ఆఫీస్ లో నైనా పరిష్కారం దొరుకుతుందని... ప్రజావాణికి తరలి వచ్చారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, బల్దియా అధికారులు నగరవాసుల నుంచి పిర్యాదులు స్వీకరించారు. గత వారం ప్రజావాణి లో ఒక వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నం చేయడం తో అలర్ట్ అయినఅధికారులు, ఈ సారి ప్రజావాణి కార్యక్రమం కు ఆంక్షలు విధించారు. ప్రజావాణి కార్యక్రమం లో పిర్యాదులు ఇచ్చే వారిని పోలీసులు తనిఖీ చేసి లోపలికి పంపారు. ఫోన్లను కుడా లోపలికి అనుమతించలేదు.

# విప్లవ వేగుచుక్క కామ్రేడ్ వీటి అబ్రహం

### ఘనంగా కామ్రేడ్ వి టి, అబ్రహం 40వ వర్ధంతి

### ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాబలం మందమర్రి మండల రిపోర్టర్ నవంబర్ 4 :**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బలోపేతానికి విశేష కృషి చేసిన విప్లవ వేగుచుక్క కామ్రేడ్ వీటి అబ్రహం అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు . సోమవారం పట్టణంలోని ఏఐటిసి కార్యాలయంలో కామ్రేడ్ వీటి అబ్రహం 40 వ జయంతి వేడుకలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో కేరళ రాష్ట్రంలో జన్మించి మైనింగ్ డిప్లమా చేసి ధన్బాద్ జార?ండ్ బొగ్గు గనుల్లో ఉద్యోగం చేసి సింగరేణి ప్రాంతమైన మందమర్రికి వచ్చాడని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రాంతంలో బొగ్గు బావుల్లో విజ్ఞాన నక్షత్రముగా కార్మికులను చైతన్యం చేస్తూ (సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్) (ఏఐటీయూసీ) సంఘాలను బలోపేతం చేసాడని తెలిపారు. భాంచంద్ దొర అనే దొరతనానికి వ్యతిరేకంగా ఎర్రజెండాను అడ్డుపెట్టి పోరాడిన యోధుడు అని అన్నారు. మందమర్రి కల్వకుంట్ల దొరలకు దుబ్బదారి పట్టించి రౌడీయిజానికి గుండాయిజానికి అణిచివేతకు అన్యాయాలకు చరమగీతం పాడారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలో జైనథ్ , కౌటాల, డబ్బా, వాంకిడి, బెంబార, గుండి, అంకుశ పురం, చిత్తాపూర్, చిర్రకుంట, ఆసిఫాబాద్, కాగజ్ నగర్, బోత్, నిర్మల్, జన్నారం,లక్షట్ పేట్, చెన్నూరు, మంచిర్యాల, ర్యాలీ గడ్ పూర్, మారుమూల ప్రాంతాలలో సైతం దొరల భూములను పంచిన మహా విప్లవ నాయకుడు అబ్రహం అని కొనియాడారు. చరిత్రలో చరిత్ర లిఖించ దగ్గ చరిత్ర గల నాయకుడు వీటి అబ్రహంని నక్సలైట్ల ముసుగులో నరహంతక గుండాల రౌడీలు మూకుమ్మడి దాడి చేసి న ఎదురు నికబడి పోరాటం చేసి వీరమరణం పొందిన కామ్రేడ్ వి టి అబ్రహంకి విప్లవ జోహార్లు అర్పించారు. ఆయన ఆశ సాధనకై

సింగరేణి కార్మిక హక్కులను కాపాడుకుంటూ ఏ ఐ టి యూ సి శ్రేణులు నడుం బిగించి

కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ

బ్రాంచ్ నాయకులు శైలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, భీమనాథుని సుదర్శన్, సోమిశెట్టి రాజేశం, కంది శ్రీనివాస్,

పెద్దపల్లి బానయ్య, మైనింగ్ స్టాప్ ఇన్చార్జి

సత్యనారాయణ, ఆంటోని దినేష్,పిట్ కార్యదర్శిలు గాండ్ల సంపత్ శర్మ. సిహెచ్చి శర్మ. ఓదెలు.

మర్రి కుమార్, రాజేష్ యాదవ్, జిబి రామకృష్ణ, గొల్ల శ్రీనివాస్, రామ్ కొమురయ్య, పార్వతి సురేష్, ఓద్దమల్ల రాజేందర్, సిపిఐ పార్టీ కార్యదర్శి కామెర దుర్గరాజు,కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు

ఎండి అఫ్రోచ్ ఖాన్, జెట్టి మల్లయ్య, వెల్డి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం




జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 4 జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించవద్దని,ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతుధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బీ గ్రేడ్ కు రూ.2,300తో పాటు రూ.500 బోనస్ పొందాలని సూచించారు. ఇంటి వద్దనే ధాన్యం ఆరబెట్టుకు రావాలన్నారు. యార్డులో ఆరబెట్టడం వల్ల మిగితా రైతులకు విక్రయించుకోవడం ఇబ్బందిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు,మార్కెట్ సెక్రెటరీ మల్లేశం,వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి,సీఈవో రవీందర్, డైరెక్టర్లు తిరుపతిరావు,రాధిక, రాజయ్య,తిరుపతి,శ్రీలత, రాజశేఖర్,కుమార్,సమ్మయ్య, బక్కయ్య,లింగారావు,రమాదేవి పాల్గొన్నారు

## సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందు ఉండాలి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ.



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 02** : లక్షెట్టిపేట సమాజ సేవలో ఆర్యవైశ్యులు ముందు ఉండాలి అని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని గుండపెద్ద కాశయ్య ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార మహొత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని 6మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆర్యవైశ్యుల సభ్యత్వ నమోదు కోసం నూతన కార్యవర్గం ముందుండి సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. మంచిర్యాల ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం జిల్లాలో నిరుపేద ఆర్యవైశ్యుల విద్య వైద్య ఖర్చుల కు సహకరించి ముందుండాలని ఆయన కోరారు. అనంతరం నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మంచిర్యాల జిల్లాలోని నిరుపేద ఆర్యవైశ్యులకు తన పదవీకాలంలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంచిర్యాల జిల్లాలో రెండింతల సభ్యత్వ నమోదుకు తప్పనిసరి చేస్తానని తెలంగాణ రాష్ట్ర వైద్య మహాసభకు తెలియజేశారు.ప్రతి ఒక ఆర్యవైశ్య సోదరుడు తనకు సహకరించాలని కోరారు.అనంతరం ప్రధాన కార్యదర్శిగా చిలువేరు వైకుంఠం, మంచిర్యాల యువజన సంఘం జిల్లా అధ్యక్షునిగా బాల సంతోష్,ప్రధాన కార్యదర్శిగా బొద్దుకూరి రాజ్ కుమార్,మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలుగా నాగిశెట్టి జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా నరేందుల సాహితి, వీఆర్వో గా కేశెట్టి వంశీ,లీగల్ అడ్వైజర్ గా నళినీకాంత్, పలువురు ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శి కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ,రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షులు నలమాస్ కాంతయ్య, గుండ పెద్ద కాశయ్య భవన స్థలదాత గుండ వీరేంద్ర దాస్, రాష్ట్ర నాయకులు ముక్త శ్రీనివాస్,గంప శ్రీనివాస్,రేణిగుంట్ల గణేష్ గుప్తా రేణిగుంట్ల శ్రీనివాస్, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు ఉప్పల శారద, కార్యదర్శి రాధ, మహిళా నాయకురాలు చిదా సదానందకుమారి, సుమారు 600 మంది ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com